రైతు ఖాతాల్లోకి రూ.180.36కోట్లు

నేడు జమకానున్న అన్నదాత సుఖీభవ రెండో విడత సాయం

- కడప జిల్లాలో విడుదల చేయనున్న సీఎం
- అన్ని ఆర్‌ఎస్‌కేలలో ప్రత్యక్ష ప్రసారం
- మర్రిపూడిలో పాల్గొననున్న మంత్రి, కలెక్టర్
- ఇతరచోట్ల ముఖ్యనేతల హాజరు



ఒంగోలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులు బుధవారం రైతుల ఖాతాల్లో జమకానున్నాయి. జిల్లాలో 2.68లక్షల మంది రైతులకు ఈ విడత రూ.180.36 కోట్ల లబ్ధి చేకూరనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కడప జిల్లా కమలాపురంలో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు జరిగే సభలో ఈ నిధులను విడుదల చేస్తారు. ప్రభుత్వ ఆదేశాలతో సీఎం సభను జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో (ఆర్‌ఎస్‌కే) స్మార్ట్ టీవీల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకంతో అన్నదాత-సుఖీభవను రాష్ట్రప్రభుత్వం అనుసంధానం చేసిన విషయం విదితమే. మూడు విడతల్లో కేంద్రం రూ.6వేలు, రాష్ట్రప్రభుత్వం రూ.14వేలు ఇస్తుండగా తొలివిడత కేంద్రం రూ.2వేలు, రాష్ట్రం రూ.5వేలు కలిపి రూ.7వేలను ఈ ఏడాది ఆగస్టు 2న రైతు ఖాతాల్లో జమ చేశారు. రెండో విడత కూడా కేంద్రం రూ.2వేలు, రాష్ట్రం రూ.5వేలు కలిపి రూ.7వేల మొత్తాన్ని బుధవారం కడప జిల్లా కమలాపురంలో జరిగే సభలో సీఎం విడుదల చేయనున్నారు. కేంద్ర, రాష్ట్ర మార్గదర్శకాలకు కొంత తేడా ఉండటంతో పీఎం కిసాన్ పథకం వర్తించే వారి కన్నా అన్నదాత సుఖీభవ పథకం ఎక్కువ మందికి అందనుంది.

మర్రిపూడిలో మంత్రి స్వామి కార్యక్రమం

అన్ని నియోజకవర్గాల్లో, జిల్లా స్థాయిలోనూ కార్యక్రమాన్ని నిర్వహించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర ముఖ్యనేతలు పాల్గొనాలని ప్రభుత్వం ఆదేశించింది. తదనుగుణంగా బుధవారం మర్రిపూడిలో కార్యక్రమానికి మంత్రి డాక్టర్ స్వామి, కలెక్టర్ రాజాబాబుతోపాటు మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య హాజరుకానున్నారు. ఇతరచోట్ల ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతలు, అధికారులు పాల్గొంటారు.



డెయిరీని పరిశీలిస్తున్న ఏపీడీడీసీఎఫ్ ఎండీ మురళీధర్

పునరుద్ధరణకు కార్యాచరణ

ఒంగోలు డెయిరీ పునరుద్ధరణపై ప్రభుత్వం నుంచి కదలిక కనిపిస్తోంది. అందుకు అవసరమైన కార్యాచరణపై పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.మురళీధర్ మంగళవారం సాయంత్రం డెయిరీని సందర్శించారు. సంస్థ ప్రాంగణాన్ని, పాలపొడి ఫ్యాక్టరీ, ఇతర విభాగాలలో ఉన్న మిషనరీని ఆయన పరిశీలించారు. సంబంధిత అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా డెయిరీ పునరుద్ధరణ కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించి నివేదించాలని వారిని ఆదేశించారు.

- ఒంగోలు డెయిరీని సందర్శించిన పాడి సమాఖ్య ఎండీ మురళీధర్
- పాలపొడి ఫ్యాక్టరీ, యంత్రాల పరిశీలన
- స్థానిక అధికారులతో సమీక్ష
- గతంలో పలుమార్లు సీఎం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాకు తలమానికంగా ఉన్న ఒంగోలు డెయిరీకి గత వైసీపీ ప్రభుత్వం సమాధి కట్టింది. ఆస్తులను ఆమూల్ సంస్థకు కట్టబెట్టే ప్రయత్నం చేసింది. వైసీపీ నిర్వాకం వల్ల డెయిరీ మూతపడగా, అమూల్ సేవలు జిల్లా రైతులకు ఉపకరించలేదు. కాగా గత ఎన్నికల ప్రచారంలోనూ, అంతకు ముందు యువగళం పాదయాత్రలోనూ జిల్లా రైతుల కోరిక మేరకు డెయిరీ పునరుద్ధరణపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, యువనేత లోకేష్ హామీ ఇచ్చారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం వచ్చాక జిల్లాలో అమూల్ కార్యకలాపాలను నిలిపివేశారు.

ఉద్యోగుల సమస్యలపై దృష్టి

ఈనేపథ్యంలో జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి చొరవ చూపి డెయిరీ అవసరాన్ని, గతంలో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ప్రాథమికంగా డెయిరీ ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషిచేసిన మంత్రి స్వామి.. అనంతరం సంస్థ పునరుద్ధరణ కోసం అధికారుల వద్ద ప్రయత్నాలు ప్రారంభించారు. అవసరమైన నివేదికలను ప్రభుత్వానికి పంపేలా జిల్లా అధికారులకు సూచించారు. తదనుగుణంగా పూర్వపు కలెక్టర్ తమీమ్ అన్సారియా, ప్రస్తుతం ఉన్న జేసీ గోపాలకృష్ణ ఆ అంశంపై దృష్టిపెట్టి ప్రభుత్వానికి నివేదించారు. ఇదేసమయంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కూడా ఒకసారి సీఎంను కలిసి డెయిరీపై చర్చించారు. ఈక్రమంలో పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్ మంగళవారం సాయంత్రం డెయిరీని సందర్శించారు. ఆ సంస్థలో కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న పూర్వపు డైరెక్టర్ వెంకటరమణతో కలిసి డెయిరీ ప్రాంగణం అంతా తిరిగి చూశారు. పాలపొడి ఫ్యాక్టరీని అలాగే వివిధ విభాగాలలో ఉన్న మిషనరీని పరిశీలించారు.

అధికారులతో సమావేశం

ప్రస్తుతం డెయిరీ పర్యవేక్షకునిగా ఉన్న ఏపీడీడీసీఎఫ్ మేనేజర్ ఆర్.రాజమోహన్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, ఇతర అధికారులతో పలు అంశాలపై మురళీధర్ చర్చించారు. ప్రధానంగా డెయిరీ పునరుద్ధరణ కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించి నివేదించాలని వారిని ఆదేశించారు. జిల్లాలో గతంలో ఒంగోలు డెయిరీ కార్యకలాపాలు జరిగిన గ్రామాలు, ప్రస్తుతం వాటిలో పాల ఉత్పత్తి, ఇతర అంశాలను పరిశీలించాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ అధికారులు టి.జయచంద్ర, డాక్టర్ జె.శ్రీనివాస్, డాక్టర్ ఎస్.భరత్ తదితరులు పాల్గొన్నారు.



కొండంతా కోటి దీపోత్సవం

మాస శివరాత్రి సందర్భంగా మంగళవారం త్రిపురాంతకం దేవస్థానం తేజోమయమైంది. పార్వతీ త్రిపురాంబ సమేత త్రిపురాంతకేశ్వరుడి ఆలయంలో కోటి దీపోత్సవం, సహస్ర జ్యోతిర్లింగార్చన, సోపాన దీపోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. దేవాలయం మెట్ల మార్గంలో భక్తి శ్రద్ధలతో దీపాలు వెలిగించారు. దీంతో కొండంతా వెలిగిపోయింది.

- ఆంధ్రజ్యోతి, త్రిపురాంతకం



కమిషనర్ వెంకటేశ్వరరావును అభినందిస్తున్న టీడీపీ నాయకులు

నగర కమిషనర్‌కు ఆర్‌డీగా ఉద్యోగోన్నతి

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర కమిషనర్ కోడూరి వెంకటేశ్వరరావుకు రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (ఆర్‌డీఎంఏ)గా ఉద్యోగోన్నతి లభించింది. ఈమేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. నగర కమిషనర్‌గా ఏడాది క్రితం బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఒంగోలులో విధులు నిర్వహిస్తుండగానే స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా పదోన్నతి లభించగా, రెండు నెలల్లోనే ఆర్‌డీఎంఏగా ప్రమోషన్ దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడో శనివారం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో ఈ-వేస్ట్ కలెక్షన్‌లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఒంగోలు కార్పొరేషన్ నిలవడంతో వెంకటేశ్వరరావు ప్రత్యేక గుర్తింపు సాధించారు. ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్‌లో ముప్పు వాటిల్లకుండా తీసుకున్న ముందస్తు చర్యలతో ప్రభుత్వం సంతృప్తి చెందింది. రెండుసార్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వెంకటేశ్వరరావు అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఆయన ఆర్‌డీఎంఏగా ఉద్యోగోన్నతి పొందినప్పటికీ ఆ హోదాలోనే ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్‌గా కొనసాగనున్నారు. మంగళవారం కార్పొరేటర్లు దాచర్ల వెంకటరమణయ్య, తిప్పరమల్లి రవితేజ, అంబూరి శ్రీనివాసరావు, సంద్రపాటి వర్ధ్వర్త్, టీడీపీ నగర మాజీ అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావులు కమిషనర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

వాటర్‌షెడ్ పనుల్లో వావ్!

- జాతీయస్థాయిలో జిల్లాకు రెండో స్థానం
- కేంద్ర మంత్రి చేతులమీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వర్షపు నీటిని ఒడిసిపట్టడంలో జిల్లా యంత్రాంగం చేసిన కృషి ఫలించింది. అడుగంటిన భూగర్భ జల మట్టాన్ని పెంచడంలో సఫలీకృతమైంది. ఏకంగా కేంద్రప్రభుత్వమే మెచ్చి ప్రశంసాపత్రం ఇచ్చి శభాష్ అంటూ అభినందించింది. జిల్లా యంత్రాంగం చేసిన కృషికి గుర్తింపుగా జాతీయ స్థాయిలో రెండో స్థానంలో నిలవడంతో మంగళవారం ఢిల్లీలో జలశక్తి శాఖ మంత్రి సీఆర్.పాటిల్ చేతులమీదుగా కలెక్టర్ రాజాబాబు ఈ అవార్డును అందుకున్నారు. ఆరో జాతీయ ఉత్తమ జల పంచాయతీ అవార్డుకు పీసీపల్లి మండలం మురుగుమ్మి గ్రామ పంచాయతీ ఎంపికైన విషయం విదితమే. 2022-23 సంవత్సరంలో జిల్లాలో డ్వామా ఆధ్వర్యంలో వాటర్‌షెడ్ పథకంలో భాగంగా నీటి సంరక్షణ పనులు చేపట్టారు. వాటర్‌షెడ్ నిధులు, ఇతర శాఖల భాగస్వామ్యంతో ఉత్తమ నీటి యాజమాన్య పద్ధతులు పాటించారు. అందులో భాగంగా రెడ్జ్-టు-వ్యాలీ విధానంలో వివిధ రకాలైన సహజ వనరుల యాజమాన్యపు పనులు చేసి వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలమట్టాలను పెంపొందించడంలో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఖండిత కందకాల పనులు, చిన్న ఊట కుంటలు, పెద్ద ఊటకుంటలు, డగవుట్ పాండ్స్, అమృత్ సరోవర్లు, పూడికతీత పనులు చేయడం ద్వారా దాదాపు 8.21 లక్షల క్యూబిక్ మీటర్ల నీటిని నిల్వ చేశారు. ఇందుకుగాను 51 పనులకు సుమారు రూ.97 లక్షల నిధులు ఖర్చుచేశారు. ఈ పనులలో సాధించిన పురోగతిని వివరించేలా డాక్యుమెంట్ చేయించి గతేడాది అక్టోబరులో కేంద్రానికి నామినేషన్ పంపించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జూన్‌లో కేంద్ర బృందం వచ్చి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించింది. దీంతో జిల్లాకు జాతీయస్థాయిలో రెండో ఉత్తమ పురస్కారాన్ని ప్రకటించింది. మంగళవారం ఢిల్లీలో కలెక్టర్ రాజాబాబుకు ట్రోఫీ, ప్రశంసాపత్రం, రూ.1.50 లక్షల నగదును అందించింది. ఈ పథకం అమలులో జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా పనులను పర్యవేక్షించిన డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌ను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, వివిధ శాఖల ఉన్నతాధికారులు అభినందించారు.



కేంద్ర మంత్రి పాటిల్ నుంచి అవార్డును స్వీకరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

సచివాలయాల్లో బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

- స్పౌజ్ విభాగానికే పరిమితం
- ఈ నెలాఖరులోపు ప్రక్రియను పూర్తిచేయాలని ప్రభుత్వ ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు స్పౌజ్ కేటగిరీ కింద అంతర్ జిల్లాల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సచివాలయాలు ఏర్పాటుచేసిన తర్వాత అంతర్ జిల్లాల బదిలీలు జరగలేదు. నియామకాల సమయంలో జిల్లాకు చెందిన అభ్యర్థులు ఇతర జిల్లాల్లో ఉద్యోగాలు పొందగా, ఇతర జిల్లాల వారు కూడా ఇక్కడ కొలువులు పొందారు. అలాంటి వారిని స్పౌజ్ కేటగిరీ కింద బదిలీ చేసేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఆ ప్రకారం బదిలీ కోరుకునే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగుల భార్య/భర్త ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతేనే అర్హులు. ఇద్దరిలో ఒకరు ప్రైవేటు ఉద్యోగైతే ఇది వర్తించదు. ఉమ్మడి జిల్లాలను యూనిట్‌గా తీసుకొని ప్రక్రియను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఖాళీల జాబితాను ఆయా శాఖల అధికారులు ప్రకటించాల్సి ఉంది. ఉద్యోగులకు ఆయా మండలాలు/పట్టణ స్థానిక సంస్థలను ఎంపిక చేసుకునేందుకు ఆప్షన్లు ఇవ్వనున్నారు. సిబ్బంది ఆయా ఎంపీడీవోలు/మునిసిపల్ కమిషనర్ల వద్ద నోడ్యూ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుంది. ఈ బదిలీల ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తిచేయాలని ఆయా జిల్లాల అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

అలసత్వం.. సమన్వయ లోపం!

ప్రారంభం కాని పంచాయతీ భవన నిర్మాణాలు

- ఉపాధి హామీ, ఆర్‌జీఎస్‌ఏలతో 18 మంజూరు
- పురోగతి లేకపోవడంపై పీఆర్ కమిషనర్ కృష్ణతేజ సీరియస్
- మండల స్థాయి అధికారులతో డ్వామా పీడీ, పీఆర్ ఎస్ఈల జూమ్ కాన్ఫరెన్స్

ఒంగోలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధి పథకం-రాష్ట్రీయ గ్రామీణ్ స్వరాజ్య యోజన (ఆర్‌జీఎస్ఏ) కింద మంజూరైన పంచాయతీ భవన నిర్మాణాలు అడుగు ముందుకు పడటం లేదు. ఒక్కో భవనానికి రూ.32లక్షలు ఈ పథకం కింద ఇస్తుండగా జిల్లాకు 18 భవనాలు మంజూరయ్యాయి. అందులో ఆర్‌జీఎస్ఏ ద్వారా రూ.25 లక్షలు ఇస్తుండగా, ఉపాధి హామీ నుంచి రూ.7లక్షలు సమకూరుస్తున్నారు. దీంతో టెండర్లు పిలిచే అవకాశం లేదు. ప్రత్యామ్నాయంగా వెండర్స్ పేరుతో మెటీరియల్ సరఫరా చేసేవారితో నిర్మాణాలు చేయించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో ఈ పథకం కింద గత ఏడాది వెలిగండ్ల మండలం పందువ పంచాయతీకి భవనం మంజూరైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వెలిగండ్ల మండలం జాళ్లపాలెం, మోటుపల్లి, హెచ్‌ఎంపాడు మండలం ఉమ్మనపల్లి, సీఎస్‌పురం మండలం వెంగనగుంట, దొనకొండ మండలం సంగాపురం, మద్దిపాడు మండలం బూరేపల్లి, పెద్దారవీడు మండలం రామాయపాలెం, ఎస్.కొత్తపల్లి, దోర్నాల మండలం గంటవానిపల్లి, బీఎస్‌తండా, త్రిపురాంతకం మండలం సంగంతాండ, గిద్దలూరు మండలం జయరాంపురం, మార్కాపురం మండలం నికరంపల్లి, పడమటిపల్లి, కే కొత్తపల్లి, పి.మాచవరం, కొమరోలు మండలం బాదినేనిపల్లిలకు మంజూరయ్యాయి. కొన్నింటికి నెలక్రితం, మరికొన్నింటికి ఇటీవల కలెక్టర్ మంజూరు ఉత్తర్వులు ఇచ్చారు.

ఇంతవరకు గ్రౌండింగ్ లేదు

గత ఏడాది మంజూరైన పందువ పంచాయతీ భవన నిర్మాణం పురోగతిలో ఉండగా ఈ ఏడాది మంజూరైన 17 భవనాలలో ఒక్కటి మినహా మిగిలినవి ఇంతవరకు గ్రౌడింగ్ కూడా కాలేదు. సకాలంలో వాటి నిర్మాణం చేస్తేనే కేంద్రం నుంచి నిధులు వచ్చేది. అయితే జిల్లాలో క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారుల అలసత్వం, వివిధ శాఖల మధ్య సమన్వయ లోపంతో భవన నిర్మాణాలు ప్రారంభం కాకపోవడమే కాక సగం భవనాలకు ఇంతవరకు స్థలాల ఎంపికే కొలిక్కి రాలేదు. ఈ విషయాన్ని గుర్తించిన పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ జిల్లా అధికారులపై సీరియస్ అయినట్లు సమాచారం. దీంతో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈలు మంగళవారం సంబంధిత మండలాల ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ డీఈలు, ఏఈలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. పలుచోట్ల లోపాలను గుర్తించిన వారు వాటి పరిష్కారానికి సూచనలు ఇచ్చారు. తక్షణం భవన నిర్మాణాలు ప్రారంభించాలని(గ్రౌడింగ్) ఆదేశించారు.



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ మోసాలు



- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సూచన

ఒంగోలు క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమాయకులను లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి పోలీసు, ఇతర ప్రభుత్వ అధికారులమంటూ వాట్సాప్ కాల్స్‌లో బెదిరింపులకు దిగి మోసాలు చేస్తున్నారని వివరించారు. సీబీఐ, కస్టమ్స్, విజిలెన్స్ అధికారుల పేరుతో బెదిరిస్తున్నారని ఆయన చెప్పారు. అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వకుండా పోలీసు అధికారులు ఎవ్వరినీ అరెస్టు చేయడం జరగదని అన్నారు.

మెప్మాలో అవకతవకలు ఒక్కొక్కటిగా వెలుగులోకి..

వివరాలు 7వ పేజీలో

- రూ.3.33 లక్షలు కాజేశారంటూ పోలీసు స్టేషన్‌లో పీడీ ఫిర్యాదు

నేడు అన్నదాత సుఖీభవ నిధులు విడుదల

కొండపి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి) : రైతుల ఖాతాల్లో బుధవారం పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ నిధులను ప్రభుత్వం జమచేయనున్నదని ఏవో మాల్యాద్రి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన పెరిదేపి, ముప్పరాజుపాలెం గ్రామాల్లో పర్యటించారు. మండలంలోని 5,333 మంది రైతులకు 3,73,31,000 రూపాయలు జమ అవుతాయన్నారు. పంటల సాగు పెట్టుబడికి ఈనిధులను వినియోగించుకోవాలని సూచించారు.

నేడు మహిళా దినోత్సవం

ఒంగోలు కల్చరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం వేడుకలు నిర్వహిస్తున్నట్లు మహిళాభ్యుదయ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళలు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొనాలని ఆమె కోరారు.

శ్రీహర్షిణీలో డిగ్రీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

ఒంగోలు విద్య, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీహర్షిణీ డిగ్రీ కళాశాలలో డిగ్రీ కోర్సు మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ఛైర్మన్ గోరంట్ల రవికుమార్, డీన్ ఆంజనేయులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ కోటాలో సీటు పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని పేర్కొన్నారు. ఈనెల 20 వరకు అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500 విద్యార్థులు తమ ఒరిజనల్ విద్యార్హతల సర్టిఫికెట్లతో అడ్మిషన్లకు హాజరు కావాలని వారు కోరారు. కళాశాలలో బీఏ(హిస్టరీ), బీకాం(కంప్యూటర్), బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్), ఆక్వాకల్చర్, మైక్రో బయాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మద్దిపాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సమస్యలను గ్రామస్థాయిలో వెంటనే పరిష్కరించాలని మద్దిపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి చెప్పారు. మంగళవారం మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వీఆర్వోల సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామంలో పాస్‌పుస్తకాల పెండింగ్ లేకుండా చూడాలని చెప్పారు.

సీఐ సతీష్ హంతకులపై చర్యలు తీసుకోవాలి

కొండపి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పరకామణి అక్రమాలను వెలికి తీసిన సీఐ సతీష్‌ను హత్య చేసిన వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని శాలివాహన యువసేన అధ్యక్షుడు ఆముదాలపల్లి గంగాధర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సంఘ నాయకులతో కలిసి కొండపిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం సతీష్ హత్య వెనుక ఉన్న దోషులను గుర్తించి వారు ఎంతటివారైనా అరెస్టు చేయాలన్నారు. నాయకులు పెద్దకాశయ్య, సుబ్బయ్య, పూర్ణచంద్రరావు, గుగ్గిళ్ల శ్రీను, బ్రహ్మానందం పాల్గొన్నారు.

ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టిన మినీ లారీ

డ్రైవర్‌తోపాటు మరొకరికి గాయాలు

టంగుటూరు (కొండపి), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ముందు వెళ్తున్న వాహనాన్ని వెనుక నుంచి మినీ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మినీ లారీ డ్రైవర్‌కు తీవ్ర, అందులోని మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున టంగుటూరు టోల్‌గేట్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తెలంగాణలోని పాల్వంచ నుంచి నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు జామాయిల్ లోడుతో మినీ లారీ సోమవారం సాయంత్రం బయల్దేరింది. టంగుటూరు టోల్ గేట్ సమీపానికి వచ్చే సరికి నిద్రమత్తులో ఉన్న డ్రైవర్ సాయి ముందువెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో ఆయన వాహనంలోనే ఇరుక్కుపోయాడు. పక్కనే అతనితోపాటు ఉన్న మరో వ్యక్తి అబ్దుల్లా స్వల్పంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్సై నాగమల్లేశ్వరరావు వెంటనే సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇనుప చువ్వలు, మోకుల సాయంతో డ్రైవర్‌ను బయటకు తీయించారు. క్షతగాత్రులిద్దరినీ అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు వైద్యసాయం కోసం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైభవంగా మాసశివరాత్రి అభిషేకాలు

త్రోవగుంట గ్రామంలో శ్రీగంగా పార్వతీసమేత మూల స్థానేశ్వర స్వామిదేవాలయంలో పూజలు

మాసదీపాలను వెలిగించిన మహిళలు



స్వామివారికి హారతులు ఇస్తున్న మహిళలు

ఒంగోలు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరం త్రోవగుంట గ్రామంలోని శ్రీగంగా పార్వతీసమేత శ్రీమూల స్థానేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి మాస శివరాత్రి అభిషేకాలు, పూజా కార్యక్రమాలను అర్చకులు ఆమంచి ఉదయభాస్కర్ వైభవంగా నిర్వహించారు. ఉదయం దేవాలయంలో రుద్రాభిషేకాలు చేశారు. సాయంత్రం ప్రదోష కాలంలో ముందుగా శివపార్వతులకు, అనంతరం నందీశ్వరుడుకి మహాభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కార్తీక మాస దీపాలను వెలింగిచారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మాస శివరాత్రి సందర్భంగా శివాలయంలో శివపార్వతులను భక్తులు ఊరేగించారు. ఈ కార్యక్రమాలలో అయ్యప్ప, శివ దీక్షధారులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేశు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీకోసం హాలులో మంగళవారం స్పెషల్ ఇంటెక్షన్ రివిజన్‌పై ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని బూత్‌లెవల్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2002 సంవత్సరం, 2025 సంవత్సరానికి సంబంధించిన ఓటర్లను మ్యాపింగ్ చేసే విధానంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అందుకోసం బూత్‌లెవల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత బీఎల్‌వోలపై ఉందన్నారు. ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న ఈసందర్భంగా బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఒంగోలు తహసీల్దార్ పిన్నిక మధుసూదన్, ఎన్నికల విభాగపు అధికారులు ఉన్నారు.



మాట్లాడుతున్న డీఆర్వో ఓబులేశు, పక్కన ఆర్డీవో లక్ష్మీప్రసన్న

యువతకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి

ఒంగోలు కల్చరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం యువత తమ విద్యకు సంబంధించిన పుస్తకాలు తప్ప మరే ఇతర పుస్తకాల పట్ల ఆసక్తి చూపటం లేదని, వారిలో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచి వారు గ్రంథాలయాల బాటపట్టే విధంగా కృషిచేయాలని ఓపీడీఆర్ నాయకులు డాక్టర్ కొర్రపాటి సుధాకర్ చెప్పారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం సాయంత్రం మరో గ్రంథాలయ ఉద్యమం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠశాలలు, కళాశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటు, పుస్తకపఠనం ఆవశ్యకత అనే అంశంపై చర్చాగోష్టి జరిగింది. మరో గ్రంథాలయ ఉద్యమ వ్యవస్థాపకులు మంచికంటి వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన జరిగిన చర్చాగోష్టిలో డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ మాతృభాష సంక్షోభంలో పడిందని, నేటి తరం సెల్‌ఫోన్ మాయలో పడి పుస్తక పఠనానికి దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రంథాలయ ఉద్యమ కార్యదర్శి క్రాంతి నల్లూరి సభను ప్రారంభించగా చర్చాగోష్టిలో డాక్టర్ మణిబాబు, నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, పి.రాజ్యలక్ష్మి, రహంతుల్లా పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డాక్టర్ కొర్రపాటి సుధాకర్

ప్రత్యామ్నాయ పంటల సాగు లాభదాయకం

పొగాకు బోర్డు ఆర్ఎం రామారావు

టంగుటూరు (కొండపి), నవంబరు18 (ఆంధ్రజ్యోతి) : రైతులు పొగాకు విస్తీర్ణాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవడం లాభదాయకమని బోర్డు ఒంగోలు ఆర్ఎం శీలం రామారావు సూచించారు. మంగళవారం ఆయన టంగుటూరులోని వేలం కేంద్రాన్ని సందర్శించారు. పొగాకు కొనుగోళ్ల తీరును పరిశీలించారు. అనంతరం జమ్ములపాలెం, తూమాడుతోపాటు, వివిధ గ్రామాల రైతులతో సమావేశమై పలు సూచనలు చేశారు. మేలైన యాజమాన్య పద్ధతులు, పంటల మార్పిడిపై అవగాహన కల్పించారు. కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు జి.ప్రసాద్ బాబు, ఐ.వెంకటేష్ మాట్లాడుతూ పొగాకుకు ప్రత్యామ్నాయంగా రైతులు తక్కువ ఖర్చుతో మినుము, శనగ, పెసర, మొక్కజొన్న లాంటి ఆహార పంటలను సాగు చేసుకోవడం ఉత్తమమని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి యుగంధర్‌రెడ్డి, వేలం నిర్వహణాధికారి ఎ.శ్రీనివాసరావు, రైతు నాయకుడు పోతుల నరసింహారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఎం ఎస్. రామారావు

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు సహకరించాలి

ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ ఈఆర్‌వో మాధురి



సమావేశంలో ఈఆర్‌వో, అధికారులు, పార్టీల ప్రతినిధులు

చీమకుర్తి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు రాజకీయ పార్టీలు సహకరించాలని సంతనూతలపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.మాధురి కోరారు. నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. 2002 ఓటర్ల జాబితాలోని ఓటర్లలో 2025 జాబితాలో నమోదైన వారిని గుర్తించి వారి వారి కుటుంబసభ్యులతో కలిపే ప్రక్రియను బీఎల్‌వోలు నిర్వహిస్తున్నట్లు మాధురి తెలిపారు. ఓటర్ల జాబితాను పకడ్బందీగా తయారుచేయటానికి పార్టీల ప్రతినిధులు నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు బ్రహ్మయ్య, ఆదిలక్ష్మి, ప్రవీణ్‌కుమార్, కమిషనర్ రామకృష్ణయ్య పాల్గొన్నారు.

బోధన తీరును నిరంతరం పరిశీలించాలి

టంగుటూరు (కొండపి), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల బోధన తీరును ప్రధానోపాధ్యాయులు నిరంతరం పరిశీలించాలని టీచ్ టూల్ శిక్షణ కోర్సు డైరెక్టర్, ఎంఈవో-1 చెల్లి ఆనందరావు సూచించారు. టంగుటూరులోని ఎంఈవో కార్యాలయంలో హెచ్ఎంలకు మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిరంతర పర్యవేక్షణ వల్ల ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 తన్నీరు బాలాజీ, రిసోర్స్‌పర్సన్‌లు పి.కృష్ణారెడ్డి, డి.బాలకోటయ్య, హెచ్ఎంలు రాంబాబు, చలపతిరావు, అరుణకుమారి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న శిక్షకులు

మోటార్ సైకిల్ అదుపుతప్పి గాయాలు

మద్దిపాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం దగ్గర మోటార్ సైకిల్ అదుపుతప్పిన ఘటనలో యువకునికి గాయాలయ్యాయి. అద్దంకి పట్టణానికి చెందిన టి.రామకృష్ణ ఒంగోలు నుంచి అద్దంకి వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో రామకృష్ణను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

ముండ్లమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు ఎస్సీ కాలనీకి చెందిన సంగీతరావు ఇంట్లో మంగళవారం మద్దిపాడు గ్రామానికి చెందిన గొట్టిముక్కల లక్ష్మణ్ చోరీకి పాల్పడ్డాడు. చుట్టుపక్కలవారు గమనించి కేకలు వేయటంతో లక్ష్మణ్ పారిపోతుండగా ఇంటి యజమానులు, గ్రామస్థులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు ఫోన్ చేయగా ఏఎస్ఐ పీవీ హనుమంతరావు, సిబ్బందితో వచ్చి సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు.

వరి సాగులో మెలకువలు పాటించాలి

మద్దిపాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : వరిసాగులో మెలకువలు పాటించాలని వ్యవసాయ అధికారి జి.స్వర్ణలత చెప్పారు. దొడ్డవరం, గార్లపాడు గ్రామాలలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఏఈవో శేషారావు, వీఏఏ రవితేజ, వెటర్నరీ అసిస్టెంట్ శ్రీనివాసరావు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్ల సంఘం జిల్లా కార్యదర్శి బాబురావుకు అభినందనలు

ఒంగోలు రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : సర్వేయర్ల సంఘ జిల్లా కార్యదర్శిగా ఎంపికైన యరమల బాబురావును ఒంగోలు రూరల్ తహసీల్దార్ షేక్ నాయబ్‌రసూల్ అభినందించారు. మంగళవారమిక్కడ జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ రసూల్ మాట్లాడుతూ మండల సర్వేయర్ల సమస్యలను పరిష్కరించటానికి కృషిచేయాలన్నారు. రైతులు భూములకు సకాలంలో కొలతలు పూర్తి చేయించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రూరల్ డీటీ అశోక్, సర్వేయర్ నాళం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు



బాబురావును అభినందిస్తున్న తహసీల్దార్ రసూల్, సర్వేయర్ వెంకటేశ్వర్లు

పరిశ్రమల స్థాపనతోనే విరివిగా ఉపాధి

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

గుంటుపల్లి, నేరేడుపల్లి గ్రామాల్లో పర్యటన

పీసీపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనతోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. తద్వారా గ్రామాభివృద్ధి జరుగుతుందన్నారు. మంగళవారం మండలంలోని గుంటుపల్లి, నేరేడుపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. దివాకరపురం సమీపంలో నిర్మిస్తున్న రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్‌కు అవసరమైన గడ్డిని పెంచేందుకు భూముల కోసం ఆయా గ్రామాల రైతులతో రెవెన్యూ అధికారులతో కలిసి చర్చించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, స్థానిక యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలకు ఈపరిశ్రమ ఎంతో ఉపయోగకరమన్నారు. రైతు లు తమ సమస్యలు, అభ్యంతరాలను వివరించగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మీ అభీష్టం మేరకే నిర్ణయం తీసుకుంటామన్నారు. బలవంత భూసేకరణ ఉండదన్నారు. కౌలుకు భూములివ్వదలచిన రైతులు తమ అంగీకార పత్రాలను తహసీల్దార్‌కు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ ఉష, నాయకులు గడ్డం బాలసుబ్బయ్య, వేమూరి రామయ్య, పులి ప్రతాప్‌రెడ్డి, నేరేడుపల్లి సర్పంచ్ పల్లా మల్లికార్జున్, మండే వెంకటకొండారెడ్డి, సానికొమ్ము విజయ భాస్కర్‌రెడ్డి, రాగిపాటి హజరత్, మూలె బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

22లోగా స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీచేయాలి

పీసీపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీని ఈనెల 22లోగా పూర్తిచేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కె.రాఘవేంద్ర భూపతి అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్‌లతో జరిగిన సమావేశంలో ఆయన మట్లాడారు. రేషన్ పంపిణీలో అక్రమాలకు తావులేకుండా ఉండేందుకే ప్రభుత్వం స్మార్ట్ రైస్‌కార్డులను తీసుకొచ్చిందన్నారు.

అవీఇవీ

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి

డీపీవో వెంకటేశ్వరరావు



కరపత్రాలను పంపణీ చేస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

ఒంగోలు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బొద్దులూరివారి పాలెం గ్రామాన్ని గ్రామస్థులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీవో వెంకటేశ్వరరావు చెప్పారు. మండలంలోని బొద్దులూరివారిపాలేన్ని మంగళవారం డీపీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాన్నారు. ఈ చెత్తను సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రానికి తరలించాలని చెప్పారు. ఆ కేంద్రం నుంచి వానపాముల ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేయించి రైతులకు అమ్మకాలు చేసి ఆదాయం పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖరరావు, పంచాయతీ కార్యదర్శి అరుణ, సర్పంచ్ కాట్రగడ్డ కవిత పాల్గొన్నారు. గ్రామస్తులకు శానిటేషన్ కరపత్రాలను పంపిణీచేశారు. కరవదిలో డీపీవో స్వామిత్వ కార్యక్రమాలను పరిశీలించారు

మద్దులూరి సునీతకు డాక్టరేట్

ఒంగోలు విద్య, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీ హర్షిణి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకురాలు మద్దులూరి సునీత డాక్టరేట్ సాధించింది. ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ సంస్థ వరంగల్ ఎన్ఐటీ నుంచి ఆమె పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఎక్స్‌ప్లోరింగ్ మల్టీ మోడల్ బయోమెట్రిక్ అథెంటికేషన్ యూజింగ్ ఎలక్ట్రో కార్డియాగ్రామి అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఆమెకు డాక్టరేట్ లభించింది. వరంగల్ నిట్ ఈసీఈ విభాగం ప్రొఫెసర్ కిషోర్‌కుమార్ మార్గదర్శకత్వంలో సునీత పరిశోధన చేశారు. 2021 సెప్టెంబరు 1నుంచి 2021 నవంబరు 13 వరకు వీరి పరిశోధనలో ప్రతిష్టాత్మక మూడు పేటెంట్లకు దాఖలు చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో సునీతను సన్మానించారు. కళాశాల ఛైర్మన్ గోరంట్ల రవికుమార్, డైరెక్టర్ గోరంట్ల హర్షిత్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, విభాగాధిపతి పీ శ్రీదేవి, పరిపాలనాధికారి జేఎస్ సురేష్‌కుమార్‌లు సునీతను అబినందించారు.



సునీతను అభినందిస్తున్న రవికుమార్

గృహ పట్టణ పథకాలపై చర్చించిన మాగుంట



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అధ్యయన సందర్శనలో భాగంగా గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసుల రెడ్డి మంగళవారం కేంద్ర పాలిత ప్రాంతమైన లక్షదీప్‌లో కమిటీ సభ్యులతో గృహ పట్టణ పథకాలపై చర్చించారు. పలు కేంద్ర పథకాలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆర్థికశాఖ మంత్రిత్వ, కవరట్టి స్మార్ట్ సిటీ, హడ్కో, ఎన్‌బీసీసీ, కెనరాబ్యాంకు తదితర సంస్థల ప్రతినిధులు ఈసమావేశంలో పాల్గొన్నారు. స్వచ్ఛభారత్ మిషన్, అర్బన్, అమృత్, పీఎం ఆవాస్ యోజన తదితర పథకాలపై ఆయా శాఖల అధికారులకు మాగుంట సూచనలు చేశారు.

ఘనంగా కార్తీక వనసమారాధన



వీడియోగ్రాఫర్స్‌ను సన్మానిస్తున్న సంఘ కార్యవర్గం

ఒంగోలు కల్చరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కార్తీక వనసమారాధన ఘనంగా జరిగింది. కొత్తపట్నం అమరా గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు, అనుబంధ వృత్తులవారు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు దగ్గుపాటి వెంకట్రావు అసోసియేషన్ కార్యక్రమాలను గురించి వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకున్నాయి. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్లను సత్కరించారు. అదేవిధంగా అసోసియేషన్ సభ్యులకు పోస్టల్ ఇన్సూరెన్స్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి దొడ్డా చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఉప్పుటూరి చంద్ర, బొజ్జా వెంకటేశ్వర్లు, రసూల్ భాస్కర్, శ్రీను, జెమిని శ్రీను, ఉదయ్‌హరి, మట్టా సత్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

డీఏ పాలిటెక్నిక్‌లో అవగాహన సదస్సు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం పంజాబ్, అమృతసర్ నుంచి నిర్వహించిన ముక్త్ భారత్ అభియాన్ ఐదో వార్షికోత్సవాన్ని వర్చువల్‌గా స్థానిక దామచర్ల ఆంజనేయులు పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జిల్లా అధికార యంత్రాంగం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పోలీస్‌శాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో విద్యార్థులు, యువతతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా ప్రతిజ్ఞ చేయించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు, ఈగిల్ టీమ్ అధికారులు, రిటైర్డ్ ఎస్పీ బల్లి రవిచంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. శ్రీనివాసరావు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, అధ్యాపకులు ఉన్నారు. ఈ సందర్భంగా యువత మాదక ద్రవ్యాల నుంచి దూరంగా ఆరోగ్యకరమైన జీవనం సాగించేందుకు ప్రేరేపించే అంశాలతో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

శివనామస్మరణతో భక్తుల పరవశం

● దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కర్పూర హారతి ● అఖండ జ్యోతిని తిలకించిన వైనం


మార్టూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మార్టూరులోని దుర్గామల్లేశ్వరి దేవస్థానంలో అఖండ కర్పూరపు జ్యోతిని వెలిగించారు. మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్ రూ.2 లక్షల విలువైన 306 కిలోల కర్పూరాన్ని అఖండ జ్యోతి కోసం అందజేశారు. ఇక నడింపల్లి హనుమత్ప్రసాద్, కంభంపాటి శ్రీనివాసరావు, దేవరపల్లి సాంబశివరావులతో పాటు పలువురు దాతలు బెంగళూరు నుంచి 12 నుంచి విశేషమైన పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. నేలపై వివిధ రకాల పూలతో శివలింగాకారం, వెంకటేశ్వరస్వామి శంకుచక్రాల అలంకరణ ఆకట్టుకుంది. భక్తుల కోలాహలం మధ్య ఆలయ అర్చకులు నార్నెపాటి సురేష్ పర్యవేక్షణలో వెలిగించిన అఖండ కర్పూరపు జ్యోతిని భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమానికి మార్టూరు, రాజుపాలెం, జొన్నతాళి, డేగరమూడి గ్రామాల నుంచి మహిళలతోపాటు, భక్తులు, భవాని, అయ్యప్ప మాలధారులు జ్యోతిని దర్శించుకున్నారు. అనంతరం దీక్షదారులకు భిక్ష ఏర్పాటు చేశారు.



పూలతో శివలింగాకార అలంకరణ



అఖండ కర్పూరజ్యోతి



ప్రత్యేక పూలతో విశేష అలంకరణలో మల్లేశ్వరస్వామి

మెప్మాలో అవకతవకలు ఒక్కొక్కటిగా వెలుగులోకి

● రూ.3.33 లక్షలు కాజేశారంటూ పోలీస్‌స్టేషన్‌లో పీడీ ఫిర్యాదు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో అవినీతి బాగోతాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. రోజురోజుకు వెలుగుచూస్తున్న అక్రమాలపై నిన్న మొన్నటి వరకు గుట్టుచప్పుడు కాకుండా మౌనం వహించిన అధికారులు నేడు పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కారు. కార్యాలయంలో పనిచేసే సునిల్ తనకు తెలియకుండా మెప్మా నిధులు రూ.3.33 లక్షల చెక్కును డ్రా చేసుకున్నారని పీడీ శ్రీహరి ఒంగోలు తాలూకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే సదరు ఉద్యోగి కొద్ది రోజులుగా ఒంగోలులో విధులు నిర్వర్తించలేనని మెప్మా ఎండీ కార్యాలయానికి బదిలీ చేయాలని కోరుకున్నారు. ఈ క్రమంలో ఆయన ఒంగోలులో విధుల నుంచి రిలీవ్ అయిన తర్వాత పీడీ తన పేరుతో ఉన్న చెక్కును డ్రా చేసుకున్నట్లు ఫిర్యాదు చేయడం ఇప్పుడు మెప్మా ఉద్యోగులలో చర్చనీయాంశమైంది. అయితే గత కొన్ని నెలలుగా మెప్మాలో ఆర్పీలుగా కొనసాగుతున్న కొందరు బోగస్ గ్రూపులు సృష్టించి గ్రూపు సభ్యులను మోసం చేసి, వాటి ఆధారంగా కోట్ల రూపాయలు దండుకున్న వారిపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేసినా విచారణ పేరుతో జాప్యం చేసిన పీడీ కేవలం రూ.3.33 లక్షల విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడం ఏమిటి? అని ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది. మరోవైపు గత కొద్ది రోజులు బోగస్ గ్రూపుల బారిన పడిన కొందరు మహిళలు తనకు అన్యాయం జరిగిందని పీడీకి ఫిర్యాదు చేస్తున్న పట్టించుకోకపోవడంపైనా పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే మెప్మాలో బోగస్ బాగోతంపై విజిలెన్స్ విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని పలువురు బాధితులు కూడా వెల్లడిస్తున్నారు.

సామాజిక న్యాయం-ఆత్మగౌరవం దక్కాలంటే కులగణన జరగాల్సిందే

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అజయ్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం, ఆత్మ గౌరవం దక్కాలంటే జనగణనలో కులగణన చేపట్టి ఆయావర్గాలకు జనాభా ప్రతిపాదికన చట్టసభల్లో ప్రాతినిథ్యం వహించేలా రిజర్వేషన్ కల్పించాని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు నగర కార్యదర్శి శ్రీరామ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ధర్నాలో అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక 11 ఏళ్లకాలంలో దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఆర్ఎస్ఎస్, సంఘ పరివార్ కనుసన్నల్లోనే భారతరాజ్యాంగం, లైకిక, ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన సాగుతోందని విమర్శించారు, రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులు, సమాజిక న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వానికి పాతర వేస్తున్నారని మండిపడ్డారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో 2023 నివేదికల ప్రకారం ఎస్సీలపై జరిగిన నేరాలకు 57,789 కేసులు, ఎస్టీలపై 12,960 కేసులు, మహిళలపై 4.48 లక్షల నేరాలు నమోదుకావడం అందుకు నిదర్శనమన్నారు. ఈ విధానాలు సమాజానికి, దేశానికి అత్యంత ప్రమాదకరంగా పరిణమించాయని ఆయన ఆరోపించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 14 వెనుకబడిన కులాలు ఉన్నాయని, గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన స్థానాలు తగ్గించడం వల్ల వేల సంఖ్యలో బీసీలు పదవులు కోల్పోయారన్నారు. ఈ కార్యక్రమంలో హేతువాద సంఘం నాయకులు బేగ్, రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ, బీసీ సంఘాల నాయకులు మస్తాన్‌రావు తదితరులు మాట్లాడారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేషును కలిసి వినతిపత్రం అందజేశారు.



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అజయ్‌కుమార్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెద్ద దోర్నాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సును మోటారు సైకిలు ఢీకొని ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతం తుమ్మలబైలు సమీపంలో శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డు వద్ద మంగళవారం జరిగింది. ఈ ప్రమాదంలో కనిగిరికి చెందిన షేక్ ఖాజావలి (27) మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన స్వామి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శివమాల ధరించిన స్వామి ఇరుముడి తీసుకునేందుకు తన స్నేహితుడు ఖాజావలిని తోడుగా తీసుకుని బైకుపై శ్రీశైలం వెళ్లారు. దైవ దర్శనం అనంతరం ఇరుముడి తీసి, మొక్కులు తీర్చుకుని తిరిగి స్వగ్రామం వస్తుండగా వేగం అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మార్కాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. ఖాజావలి అక్కడికక్కడే మృతిచెందగా, స్వామికి తీవ్ర గాయాలయ్యాయి. 108లో సుండిపెంట వైద్యశాలకు స్వామిని తరలించారు. ఎస్సై మహేష్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. స్వామి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు.



ఖాజావలి (ఫైల్)

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో చినగంజాం విద్యార్థుల సత్తా

చినగంజాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో చినగంజాం విద్యార్థులు సత్తా చాటి పతకాలు సాధించారు. కాకినాడ సూర్యకళా మందిరంలో ఈనెల 15, 16, 17 తేదీల్లో ఏపీ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 39వ సబ్ జూనియర్, 41వ సీనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలను రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు హర్షవర్ధన్‌ప్రసాద్, షేక్ అబ్దుల్ సలాం ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 435 మంది పాల్గొన్నట్లు తైక్వాండో కోచ్ వాటుపల్లి సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక సత్యం హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు డి.దేవ ఆదిత్య రజిత పతకం, ఎం.జనని కాంస్య పతకం, చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎం.జ్ఞానేంద్రవర్మ కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. మంగళవారం చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాల, సత్యం హైస్కూల్‌లలో జరిగిన అభినందన సభలో కాంస్య పతకం సాధించిన జ్ఞానేంద్రవర్మని పాఠశాల హెచ్‌ఎం కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, పీడీ గంటా అంకమ్మ, ఉపాధ్యాయులు, సత్యం హైస్కూల్‌లో రజతం, కాంస్య పతకాలు సాధించిన దేవ ఆదిత్య, ఎం.జననిలను కరస్పాండెంట్ నున్నా హరనాథ్‌బాబు అభినందించారు.



త్రిపురాంతకంలో శివనామస్మరణ

త్రిపురాంతకంలోని త్రిపురాంతక దేవస్థానంలో మంగళవారం ప్రమిదల నడుమ పూలతో శివలింగ అలంకరణ చేసి మహిళా భక్తులు పూజలు చేశారు.

పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థులకు విహారయాత్రలు

ఒంగోలు విద్య, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పీఎం శ్రీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విజ్ఞాన విహార యాత్రలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాలల్లో ఈనెల 20తో సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు ముగుస్తున్నందున ఈనెలాఖరులోపు విహార యాత్రలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విజ్ఞాన విహారయాత్రకు ఒక్కొక్క విద్యార్థికి రూ.500 చొప్పున సమగ్ర శిక్ష ద్వారా నిధులు విడుదల చేశారు. ఈ నిధులతో 6 నుంచి 12 తరగతుల వరకు చదువుతున్న విద్యార్థులను విహార యాత్రలకు తీసుకెళ్తారు. పాఠశాలల్లోని మొత్తం విద్యార్థుల్లో 8 శాతం మందికి మాత్రమే విజ్ఞాన యాత్రకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

'జిల్లా యూనిట్' ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండికేప్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా యూనిట్ ఎన్నికలకు ఎన్నికల అధికారి బి.కృష్ణకిషోర్ నోటిఫికేషన్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈనెల 23వ తేదీన నామినేషన్ల స్వీకరణ జరుగుతుందన్నారు. ఎన్నికల సహాయ ఎన్నికల అధికారిగా వి.హరిబాబు, ఎన్నికల పరిశీలకులుగా ఎం.వెంకటేశ్వరరావు వ్యవహరించనున్నారు. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు మొత్తం 11 పోస్టులకు ఈ ఎన్నికలు జరుగుతాయి. ఈనెల 23వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ అదేరోజు సాయంత్రం నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ జరుగుతుంది. ఎన్నిక 30వ తేదీ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్‌జీవో భవన్‌లో పోలింగ్ జరుగుతుంది. అనంతరం ఓట్లలెక్కింపు అదేరోజు జరుగుతుందని ఎన్నికల అధికారి కృష్ణకిషోర్ తెలిపారు.

దర్శి ప్రాంతవాసికి అరుదైన అవార్డు



రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాజశేఖరరాజు

దర్శి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణానికి చెందిన డాక్టర్ పొదిలి రాజశేఖరరాజుకు అరుదైన గౌరవం దక్కింది. నీటి సంరక్షణ కోసం ఆయన చేసిన కృషిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయి అవార్డుకు ఎంపిక చేసింది. ఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా మంగళవారం ఈ అవార్డును అందుకున్నారు. గత 20 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్యను తగ్గించేందుకు, వర్షం నీటిని నిల్వ చేసి భూగర్భజలాలను పెంపొందించేందుకు సుమారు 600 గ్రామాల్లో నీటి సంరక్షణ కార్యక్రమాలను రాజశేఖరరాజు నిర్వహించారు. ఆయన అమలుచేసిన జల సంరక్షణ విధానంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లోని ఏడు జిల్లాల్లో సుమారు రెండు లక్షల మందికి ప్రయోజనం చేకూరింది. ఆ ప్రాంతాల్లో రాజశేఖరరాజు సారథ్యంలో నిర్మించిన చెక్‌డ్యామ్‌లు, ఫారంపండ్స్, రీచార్జి పిట్స్ నీటి నిల్వకు, సంరక్షణకు ఎంతో దోహదపడ్డాయి. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయి అవార్డును అందజేసింది.

జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



డివిజన్‌స్థాయిలో గెలుపొంది జిల్లా జట్లకు ఎంపికైన ఎర్రగొండపాలెం విద్యార్థులతో ఎంఈవో ఆంజనేయులు, ఉపాధ్యాయులు

ఎర్రగొండపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలకు ఎంపిక కావడంతో మంగళవారం ఎంఈవో పీ ఆంజనేయులు, ఎంఈవో 2 మల్లునాయక్, హెచ్‌ఎం ఎండీ ఖాశిం, ఉపాధ్యాయులు అభినందించారు. క్రీడాకారులుగా రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావడం శుభపరిణామం అని అన్నారు. పీడీ త్రినాథ్ మాట్లాడుతూ అండర్-17 బాలుర విభాగంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అజయ్, అనిల్, అండర్-14లో 9వ తరగతి విద్యార్థి నోమన్‌ఖాన్, అండర్-14 బాలికల విభాగంలో 9వ తరగతి చదువుతున్న మల్లిక, శ్రావణి, దేవిబాయి, సుస్మిత జిల్లా కబడ్డీ ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరంతా త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ సెలక్షన్స్‌లో పాల్గొంటారని అన్నారు.

జిల్లాస్థాయి ఖోఖోకు గణపవరం విద్యార్థులు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

త్రిపురాంతకం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలో జరిగిన డివిజన్‌స్థాయి ఖోఖో పోటీల్లో గెలుపొంది జిల్లాస్థాయి పోటీలకు గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు జె.ఆనందరావు తెలిపారు. 14 సంవత్సరాల బాలురు, బాలికల విభాగంలోనూ, 17 సంవత్సరాల బాలురు, బాలికల విభాగంలోనూ ఎంపికైన విద్యార్థులను ఫిజికల్ డైరెక్టర్ బాలరాజును పలువురు అభినందించారు.

లాభాల బాటలో సొసైటీలు



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సీతారామయ్య తదితరులు

ఒంగోలు విద్య, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాలో సంఘాలన్నీ లాభాల్లో నడుస్తున్నాయని పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య అన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పీడీసీసీ బ్యాంకు కేంద్ర కార్యాలయ అవరణలో సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ జిల్లాలో సంఘాలను బలోపేతం చేయడంతోపాటు జిల్లా రైతాంగానికి, ఖాతాదారులకు బ్యాంకింగ్ రంగంలో నూతన విధానాలను చేరువ చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు వ్యవహారాలు సహకార సూత్రాలకు లోబడి ప్రగతి సాధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘాల అధ్యక్షులు, బ్యాంకు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

15 రోజుల్లోగా సమస్యలకు పరిష్కారం

● ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 15 రోజుల నిర్ణీత కాలవ్యవధిలోగా ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ప్రజాదర్బార్ జరిగింది. మార్కాపురం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. మొత్తం 96 అర్జీలు వివిధ సమస్యలపై దాఖలైనట్లు అధికారులు తెలిపారు. వాటిలో ఎక్కువశాతం రెవెన్యూ పరమైన సమస్యలపై వచ్చిన అర్జీలే ఉన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ ప్రజాదర్బార్ కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని 15 రోజుల్లోగా పరిష్కరించే విధంగా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ముఖ్యంగా కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపామన్నారు. ప్రతినెలా ఒక మండలంలో ప్రజాదర్బార్ కార్యక్రమం ఉంటుందన్నారు. వచ్చే నెలలో తర్లుపాడు మండలంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, విద్యుత్ ఈఈ నాగేశ్వరరావు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఐకేపీ, మెప్మా, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ చెందిన డివిజన్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	128, 137, 148
చికెన్ విత్ స్కిన్ (కిలో)	240.00
చికెన్ స్కిన్ లెస్ (కిలో)	250.00

మాకు తెలియకుండానే కోర్టులో కేసులు!

● శాప్ అధికారులకు కబడ్డీ క్రీడాకారుల ఫిర్యాదు

విజయవాడ(స్పోర్ట్స్), నవంబరు18 (ఆంధ్రజ్యోతి) : తమ ప్రమేయం లేకుండా, తమ సంతకాలు లేకుండా హైకోర్టులో తాము కేసులు వేసినట్లు కొంతమంది వ్యక్తులు ఆరోపణలు చేస్తున్నారని ప్రకాశం జిల్లాకు చెందిన కె.హరిప్రసాద్ రెడ్డి, జి.నమరసింహరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తమకు తెలియకుండా తమ సంతకాలతో కేసులు ఏవిధంగా కేసులో వేశారో అర్థం కావడం లేదన్నారు. దీనిపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం శాప్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. జాతీయస్థాయి కబడ్డీ పోటీల ఎంపికకు వెళ్లిన తాము అర్హత సాధించలేదన్నారు. ఆ సమయంలో కబడ్డీ క్రీడాకారులు కొందరు తమతో మాట్లాడారన్నారు. ఆ తరువాత కొన్ని రోజులకు తమను ఎందుకు ఎంపిక చేయలేదని ప్రశ్నిస్తూ హైకోర్టులో తమ పేరుతో కేసు వేసినట్లు నోటీసులు రావడంతో ఆశ్చర్యపోయామన్నారు. ఈ విషయాన్ని శాప్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఇటువంటి చర్యలతో ప్రతిభగల క్రీడాకారులకు అన్యాయం జరుగుతందని అన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరామన్నారు. ఇటువంటి చర్యలతో క్రీడాకారుల భవిష్యత్తుతో ఎవరూ ఆడుకోవద్దని వేడుకుంటున్నామన్నారు.

నేడు అన్నదాత సుఖీభవ

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చేతుల మీదుగా నగదు జమ కార్యక్రమం

గిద్దలూరు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పధాన మంత్రి కిసాన్ స్కీం, అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని మార్కెట్‌యార్డు ఆవరణలో ఈనెల 19 బుధవారం నిర్వహిస్తున్నారు. మంగళవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి నివాసం వ్యవసాయాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో 2వ విడత అన్నదాత సుఖీభవ పథకం కింద 37,649 మంది రైతులకు ఒక్కొక్కరికీ రూ.5వేల చొప్పున మొత్తం రూ.18.82కోట్ల నగదు రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్నారు. అలాగే ప్రధానమంత్రి కిసాన్ పథకం ద్వారా 32,762 మంది రైతులకు రూ.2వేల చొప్పున 6.55 కోట్లు జమ కానున్నది. ఎమ్మెల్యే చేతులమీదుగా జరిగే ఈ కార్యక్రమానికి రైతులు భారీగా హాజరు కానున్నారని వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశ్రీ తెలిపారు.


వ్యవసాయాధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

5,402 మంది రైతులకు ప్రయోజనం
ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి



రాచర్ల : అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 5402మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, మార్కాపురం ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన అన్నదాత సుఖీభవ సంబంధించిన వివరాలను ఆయన తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించనున్నారని అందులో భాగంగా నియోజక వర్గ స్థాయిలో రైతు సేవా కేంద్రం వద్ద ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో అన్నదాత సుఖీభవ సంబంధించి 5402మంది రైతులు అన్నదాత సుఖీభవకు ఎంపికయ్యారని అందుకు సంబంధించి రైతులకు రూ.3.72కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్‌ను తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు, కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

నేడు గురిజేపల్లిలో

ఎర్రగొండపాలెం రూరల్ : రైతులకు అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం ద్వారా అందించే కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని గురిజేపల్లి గ్రామంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పాల్గొంటారని మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి మంగళవారం తెలిపారు. టీడీపీ నాయకులు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొనాలని కోరారు.

అర్హులైన ప్రతి రైతుకు పీఎం కిసాన్ నగదును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బుధవారం జమ చేస్తున్నట్లు వ్యవసాయాధికారిని కే నీరజ తెలిపారు. మంగళవారం మండలంలోని వాదంపల్లి, అమానిగుడిపాడు గ్రామాలలో రైతు సేవా కేంద్రాలలో రైతులతో సమావేశం నిర్వహించారు. మండలంలో 8,519 మంది అర్హులు కాగా రూ.5.71కోట్లు నిధులు జమకానున్నట్లు తెలిపారు. రబీలో సాగు చేసిన పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. పంటలను పరిశీలించి రైతులకు అవసరమైన పలు సలహాలు, సూచనలు అందించారు. ఆర్‌సీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కందుల ఆధ్వర్యంలో

తర్లుపాడు : అన్నదాత సుఖీభవన నిధులు బుధవారం విడుదల చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి జ్యోష్నాదేవి తెలిపారు. సచివాలయ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు. నియోజవర్గ రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు జ్యోతిర్లింగ మహాపూజ

కొమరోలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోపనిపల్లె గ్రామం శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో శివదీక్ష గురుస్వామి పొట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి 6గంటల నుంచి జ్యోతిర్లింగ మహాపూజ కార్యక్రమం జరుగుతుందని ఆలయ ధర్మకర్త వీ శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు.

త్రిపురాంతకంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

త్రిపురాంతకం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): త్రిపురాంతకంలోని ఉభయ దేవాలయాల్లో ఏలూరు జిల్లా ఉంగుటూరు ఎమ్మెల్యే పి.దర్మరాజు పూజలు చేశారు. మాస శివరాత్రిని పురస్కరించుకొని మంగళవారం వచ్చిన ఆయన స్వామివారి ఆలయంలో పూజలు అనంతరం బాల త్రిపురసుందరీదేవి అమ్మవారిని దర్శించుకుని పూజలో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్య నిర్వాహణాధికారి అనిల్‌కుమార్ ఆయనకు స్వాగతం పలికారు.


జాబ్ మేళాలో ఎంపికైన యువత

జాబ్ మేళాను ఉపయోగించుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న జాబ్ మేళాలను ఉపయోగించుకోవాలని జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి ఇందిరాదేవీ అన్నారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏపీ స్కిల్ డెవలంప్ కార్పొరేషన్ నైపుణ్యం పోర్టల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 389 మంది హాజరయ్యారు. 232 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారని ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జ్ శ్రీనివాసచారి తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ, సిబ్బంది షేక్ ఫిరోజ్ గాంధీ, నందన్‌బాబు, అజయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

పొదిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వేమన మంగళవారం అన్నారు. కొత్త ఫోన్ నెంబర్లు, వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ కాల్స్‌తో మోసం చేస్తున్నారని తెలిపారు. బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఎవరూ ఫోన్‌లు చేయరని, ఓటీపీలు అడగరని తెలిపారు. బ్యాంక్ పేరు చెప్పి ఆధార్, అకౌంట్ వివరాలు అడిగితే ఎవరికీ చెప్పవద్దని సూచించారు. పోలీసులమని చెప్పే కాల్స్‌కు స్పందించవద్దని, అలాంటి వాటిపై పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

గుండె పోటుతో హోంగార్డు గాలెయ్య మృతి


గాలెయ్య

మార్కాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం టౌన్ పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న జి.గాలెయ్య(50) మంగళవారం గుండె పోటుతో మృతిచెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మంగళవారం విధులకు హాజరైన గాలె య్య ఒంట్లో నలతగా ఉందని చెప్పి 11.00 గంటలకు కొండారెడ్డి కాలనీలోని ఇంటికి వెళ్లారు. కుటుంబ సభ్యులు ఆయన్ని శ్రీనివాస థియేటర్ సమీపంలో ని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలిస్తుండగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. గాలెయ్య మృతిపట్ల డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు, సీఐ పి.సుబ్బారావు, టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సహచర హోంగార్డులు కన్నీటి పర్యంతమయ్యారు.

మినీ లారీ బోల్తా
ఐదుగురికి తీవ్ర గాయాలు, మరో ముగ్గురికి స్వల్పం


గాయపడిన నాగమణి


గాయపడిన భవాని

పెద్ద దోర్నాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వేగం అదుపు తప్పి మినీ లారీ బోల్తా పడిన ఘటన శ్రీశైలం - దోర్నాల ఘాట్ రోడ్డులో పెద్ద మూలమలుపు ప్రాంతం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. విజయవాడకు చెందిన 8మంది ఫ్లేవుడ్ కంపెనీకి చెందిన వారు శ్రీశైలం దైవ దర్శనానికి వెళ్తుండగా గణపతి చెక్‌పోస్టు సమీపంలో పెద్దమూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలకు దారివ్వబోయి వాహనం వేగం అదుపు తప్పి పక్కకు బోల్తా పడింది. వాహనంలో ప్రయాణిస్తున్న ఐదుగురు నాగమణి, భవాని, ఆనందరావు, లోకేశ్, మాబుసుల్తాన్‌కు తీవ్ర గాయాలు కాగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ప్రమాదం సమాచారం తెలుసుకున్న అటవీ శాఖాధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించారు. ఎస్సై మహేశ్ కేసు నమోదు చేశారు.

కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

కొనకనమిట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పామూరుకు చెందిన సోమిశెట్టి శ్రీరాములు (70) తన ఇంటి వద్ద సమస్యలతో కలత చెంది మండలం చినారికట్ల గ్రామానికిచేరుకొని సమీప ఎర్రవాగులో సోమవారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం చినారికట్ల గ్రామస్థులు పొలం పనులకు వెళ్తూ మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారమివ్వగా ఎస్ఐ శ్రీకాంత్ మృతదేహం వద్ద ఉన్న ఆధారాలతో పామూరుకు చెందిన సోమిశెట్టి శ్రీరాములుగా గుర్తించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అతడికి భార్య రవణమ్మ, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పంచాయతీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

కొమరోలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాదినేనిపల్లి గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.36లక్షల నిధులు మంజూరు కాగా ఎంపీడీవో సానికొమ్ము సత్యం మంగళవారం పరిశీలించారు. బాదినేనిపల్లె గ్రామంలో స్థానిక పాఠశాల పక్కనున్న గ్రామ కంఠం స్థలాన్ని పరిశీలించి, సర్వే నెంబరు 64/3లో పంచాయతీ భవన నిర్మాణం కోసం 6సెంట్లు కేటాయించినట్లు ఎంపీడీవో తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో జేసీహెచ్ చెన్నారావు, పంచాయతీరాజ్ స్పెషల్ ఏఈ సుబ్బారావు, సర్పంచ్ జయరామిరెడ్డి, సర్వేయర్ మధుసూదన్ రెడ్డి, వీఆర్వో రాజేశ్వరి పంచాయతీ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

వైభవంగా కోటి దీపోత్సవం

గిద్దలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అత్యంత వైభవంగా కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. శివునికి వివిధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. వందలాది మంది మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి

గిద్దలూరు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రజా ప్రభుత్వం నెరవేర్చాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే ప్రారంభించాలని సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య అన్నారు. పట్టణంలో మంగళవారం భవన నిర్మాణ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఉచిత ఇసుక విధానం తక్షణమే అమలు చేయాలని, సగిలేరు ప్రాంతంలో లభ్యమవుతున్న ఎర్ర ఇసుకను ఉచితంగా సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

గిద్దలూరు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీఐ కే సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ప్రధాన రోడ్లలో పోలీసులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టి వాహనదారుల లైసెన్సులు, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ పత్రాలను పరిశీలించారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని తెలిపారు.


నాట్యకారులతో పాఠకులు

అలరించిన భరతనాట్యం

గిద్దలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బాలికలు నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన అందరినీ అలరించింది. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ పాటవాలు దాగి ఉంటాయని, ప్రదర్శన సమయంలో అవి వెలుగులోకి వస్తాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. విద్యతోపాటు అన్ని రంగాలలో రానించాలని పేర్కొన్నారు. ఆటపాటలు, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం లాంటి కలలు మానసిక వికాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.స్వరూపారెడ్డి, విశ్రాంత ఆచార్యులు ఎస్.నారాయణరెడ్డి, గ్రంథపాలకురాలు ఎన్.ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కిశోర్, కార్యదర్శి ఫరూఖ్, రిటైర్డ్ ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీలు

మార్కాపురం వన్‌టౌన్ : గ్రంథాలయాలు విజ్ఞానం పెంపునకు తోడ్పడుతాయని గ్రంథాలయ అధికారి జీవీ శివారెడ్డి అన్నారు. శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా అధ్యాపకులు శేషకుమార్, సుబ్బారావు సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథపాలకుడు మండపాటి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

రాచర్ల : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న వివిధ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని గ్రంథపాలకుడు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సెమినార్ క్విజ్ పోటీలు నిర్వహించగా జడ్పీ హెచ్‌ఎస్, స్పందన, విద్వాన్ పాఠశాలల నుంచి 65 మంది విద్యార్థులు పాల్గొన్నారని, ఈ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ఈనెల 20వ తేదీన బహుమతులు అందించనున్నట్లు ఆయన తెలిపారు.

బోధనలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

పెద్ద దోర్నాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక శిక్షణ తరగతుల ద్వారా ఉపాధ్యాయ సిబ్బంది బోధనలో నైపుణ్యాలు పెంపొందించుకుని విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలని ఎంఈవో మస్తాన్ నాయక్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రిఫ్రెషర్ టీచ్ టూల్ ట్రైనింగ్ ప్రోగ్రాంను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ప్రోగ్రాంకు కోర్సు డైరెక్టరుగా వ్యవహరిస్తున్న ఎంఈవో మస్తాన్ నాయక్ పలు అంశాలపై వివరించారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థి సామర్థ్యాన్ని తెలుసుకొని తగిన రీతిలో ప్రత్యేక నైపుణ్యాలను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో మాస్టరు ట్రైనర్లు బాలకృష్ణ నాయక్, రహమత్, ప్రధానోపాధ్యాయురాలు శ్యామ్ ప్రసన్నతాంజలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాలపై దాడులు నివారించాలి

మార్కాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దళితులు, మైనార్టీలు, అట్టడుగు వర్గాలపై దాడులను నివారించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కాపాడాలని కోరుతూ సీపీఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేవీ కృష్ణగౌడ్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితులు, మైనార్టీలు, అట్టడుగు వర్గాలపై దాడులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. స్వార్థ రాజకీయాల కోసం కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి దేశంలో మత సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా వివిధ కులాలు, మతాల మధ్య చిచ్చులు పెడుతూ పబ్బం గడుపుకుంటుందని విమర్శించారు. సీనియర్ నాయకులు అందె నాసరయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అమలు కావడంలేదన్నారు. మనువాద మూలాలను ప్రోత్సహించే ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను ఎన్‌డీఏ అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఏలూరి వెంకటరెడ్డి, బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎల్లంపల్లి మల్లిఖార్జునరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టి.హరిబాబు, సీపీఐ నాయకులు డాకాల పుల్లయ్య, కె.కోటేశ్వరరావు, చెవుల వీరయ్య, నక్కా తిరుపతయ్య పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

కేజీబీవీలో జీసీడీవో ఆకస్మిక తనిఖీ


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జీసీడీవో హేమలత

రాచర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల కెజిబివి (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం) పాఠశాలను జీసీడీవో కోగంటి హేమలత మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించి బాలికలు, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంట గది, స్టోర్ రూమ్ ప్రత్యేకంగా పరిశీలించి వాటికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించారు. పాఠశాలలో అందే మౌలిక వసతుల గురించి బాలికలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలని, బాలికలకు నాణ్యమైన విద్యతోపాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఇంటర్మీడియట్ బాలికలకు జరుగుతున్న పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించే విధంగా ప్రత్యేక కృషి చేయాలని, ప్రత్యేక అధికారి డీ మాలకొండమ్మకు సూచించారు. పాఠశాలలో పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. బాలికలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా, కలిగించినా లేదా సిబ్బంది సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా విధులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంపీడీవో

కంభం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బోర్డు పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనాలను ఎంపీడీవో వీరభద్రాచారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడివో మెనూలో రుచి, నాణ్యతలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ప్రాంగాణంలోని భవిత కేంద్రాన్ని సందర్శించి ప్రత్యేక అవసరాల పిల్లల హాజరు, వ్యక్తిగత నైపుణ్యాలను పరిశీలించారు. విభిన్న ప్రతిభావంతుల బోధనలో ఉపాధ్యాయులు ఓర్పు, నేర్పులతోపాటు ప్రత్యేక నైపుణ్యాలను ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వరికుంట్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అరుణ్ కుమార్, ఈశ్వరి పాల్గొన్నారు.

మిరపలో యాజమాన్య పద్ధతులు పాటించాలి
ఏవో జవహర్ లాల్ నాయక్

పెద్దదోర్నాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మిరపలో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ అన్నారు. మండలంలోని హసనాబాద్, జమ్మిదోర్నాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏవో ఆ గ్రామాల్లో సాగు చేసిన మిరప,కంది పైర్లను పరిశీలించారు. కంది పూత దశలో ఉండటం గమనించారు. పూత నిలిచేందుకు, పురుగు ఆశించకుండా నివారణ చర్యలు చేపట్టాలని ఆక్రమంలో ఎకరాకు 500గ్రా.ల వేప కషాయం, క్లోరిపైరిఫాస్ 2.5ఎంఎల్ లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేయాలని సూచించారు. అనంతరం మండలంలో చాలా మంది విత్తన మొక్కజొన్న సాగు చేస్తున్నారని అయితే సంబంధిత ఏజన్సీల నుండి తప్పనిసరిగా అగ్రిమెంటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ రవికుమార్, వీహెచ్ఏ శిరీష రైతులు పాల్గొన్నారు.


జెండా వందనం చేస్తున్న చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి

సొసైటీలతో రైతులకు చేయూత

కొనకనమిట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో చిన్న, సన్నకారు రైతులకు సొసైటీ సంఘాలు చేయూతగా నిలుస్తాయని చినారికట్ల సొసైటీ చైర్మన్ సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని చినారికట్ల గ్రామంలో మంగళవారం సహకార సంఘాలు ఏర్పడి 72 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చైర్మన్ జెండా వందనం చేశారు. సహకార సంఘాల రుణాలతో ఎందరో రైతులు అభివృద్ధి చెందారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఈవో యడవల్లి చినమస్తానయ్య, టీడీపీ అధ్యక్షుడు బాబూరావు, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

అచ్యుత్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కందుల

పెద్దదోర్నాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నదోర్నాల గ్రామానికి చెందిన ఐటీడీపీ నాయకుడు అన్నపురెడ్డి అచ్యుత్‌రెడ్డి మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మంగళవారం అచ్యుత్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. అనంతరం దోర్నాలలో సొసైటీ అధ్యక్షుడు బట్టు సుధాకర్‌రెడ్డిని పరామర్శించారు. ఆయనవెంట బీసీ సంఘం సీనియర్ నాయకులు కనిగిరి వెంకటరమణ, స్థానిక నాయకులు అంబటి వీరారెడ్డి ఉన్నారు.

మత్తు పదార్థాల నిషేధం అందరి బాధ్యత

కంభం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాల నిషేధం అందరి బాధ్యతని ఎంఈవో అబ్దుల్ సత్తార్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా భారతదేశాన్ని మాదక ద్రవ్య రహితంగా ఉంచేందుకు చేసే ప్రచారంలో యువత పాల్గొనాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఈవో

22లోగా స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీచేయాలి



మాట్లాడుతున్న డీటీ రాఘవేంద్ర భూపతి

పీసీపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీని ఈనెల 22లోగా పూర్తిచేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కె.రాఘవేంద్ర భూపతి అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో జరిగిన సమావేశంలో ఆయన మట్లాడారు. రేషన్ పంపిణీలో అక్రమాలకు తావులేకుండా ఉండేందుకే ప్రభుత్వం స్మార్ట్ రైస్‌కార్డులను తీసుకొచ్చిందన్నారు. కొత్తగా వచ్చిన రైస్‌కార్డుల్లో లబ్ధిదారుల వివరాలు ఏమైనా తప్పుగా నమోదై ఉంటే గ్రామ సచివాలయంలో సవరణలు చేసుకునే అవకాశం ఉందన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీని ఈనెల 26 నుంచి 30లోగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో డీటీ ధర్మతేజ పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

పామూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో పంటలు సాగుచేసే రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడి ఖర్చులను తగ్గించుకోవాలని ఏవో టి.అబ్రహంలింకన్ సూచించారు. మంగళవారం మండలంలోని చింతపాలెం, బలిజపాలెం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ నిధులు బుధవారం విడుదల సందర్భంగా మండలంలోని 14 రైతు భరోసా కేంద్రాల్లో జరిగే ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో రైతులు పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రుతి, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో నాల్గో సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు మంగళవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలకు సమతుల్య పోషకాహారం ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో కౌలూరి రఫియా, కొట్టె ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

ముండ్లమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు ఎస్సీ కాలనీకి చెందిన సంగీతరావు ఇంట్లో మంగళవారం మద్దిపాడు గ్రామానికి చెందిన గొట్టిముక్కల లక్ష్మణ్ చోరీకి పాల్పడ్డాడు. చుట్టుపక్కలవారు గమనించి కేకలు వేయటంతో లక్ష్మణ్ పారిపోతుండగా ఇంటి యజమానులు, గ్రామస్థులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు ఫోన్ చేయగా ఏఎస్ఐ పీవీ హనుమంతరావు, సిబ్బందితో వచ్చి సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పామూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పామూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రూరల్ డెవలప్‌మెంట్ స్కీమ్‌లో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం బుధవారం ఉదయం 8 నుంచి పది గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ షేక్ జిలాని ఒక ప్రకటనలో తెలిపారు. పామూరు, తిరగలదిన్నె, బుక్కాపురం, నుచ్చుపొద గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు రైతుల ఖాతాల్లోకి 'అన్నదాత సుఖీభవ'

పీసీపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతుల ఖాతాలకు బుధవారం అన్నదాత సుఖీభవ నగదు జమకానున్నాయని మండల వ్యవసాయ అధికారి ఎస్.రంగాక్రిష్ణ అన్నారు. మంగళవారం పెదఅలవలపాడు, గుదేవారిపాలెం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మట్లాడారు. మండలంలో 6,625మంది రైతులకు 4.49కోట్ల రూపాయల నగదును ప్రభుత్వం విడుదల చేస్తుందని చెప్పారు. ఏడాది ఖరీఫ్‌కు సంబంధించిన ఈక్రాప్ వివరాలు ఆర్ఎస్‌కేలలో ప్రదర్శించామన్నారు. రైతులు వాటిని పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే గ్రీవెన్స్‌లో ఇవ్వాలని చెప్పారు.

నేడు వెలిగండ్లకు ఎమ్మెల్యే రాక

వెలిగండ్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వెలిగండ్లలో బుధవారం జరిగే కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పాల్గొంటారని టీడీపీ మండల అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి తెలిపారు. ఉదయం పది గంటలకు జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంటకు జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జరిగే అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.

పరిశ్రమలతోనే ఉపాధి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
- గుంటుపల్లి, నేరేడుపల్లి గ్రామాల్లో పర్యటన



నేరేడుపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

పీసీపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనతోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. తద్వార గ్రామాభివృద్ధి జరుగుతుందన్నారు. మంగళవారం మండలంలోని గుంటుపల్లి, నేరేడుపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. దివాకరపురం సమీపంలో నిర్మిస్తున్న రిలయన్స్ కంప్రెస్ట్ బయోగ్యాస్ ప్లాంట్‌కు అవసరమైన గడ్డిని పెంచేందుకు భూముల కోసం ఆయా గ్రామాల రైతులతో రెవెన్యూ అధికారులతో కలిసి చర్చించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, స్థానిక యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలకు ఈపరిశ్రమ ఎంతో ఉపయోగకరమన్నారు. రైతులు తమ సమస్యలు, అభ్యంతరాలను వివరించగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మీ అభీష్టం మేరకే నిర్ణయం తీసుకుంటామన్నారు. బలవంత భూసేకరణ ఉండదన్నారు. కౌలుకు భూములివ్వదలచిన రైతులు తమ అంగీకార పత్రాలను తహసీల్దార్‌కు ఇవ్వాలన్నారు.

కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ ఉష, నాయకులు గద్దం బాలసుబ్బయ్య, వేమూరి రామయ్య, పులి ప్రతాప్‌రెడ్డి, నేరేడుపల్లి సర్పంచ్ పల్లా మల్లికార్జున్, మండే వెంకటకొండారెడ్డి, సానికొమ్ము విజయభాస్కర్‌రెడ్డి, రాగిపాటి హజరత్, మూలె బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరాయిపంచన మండల విద్యాశాఖ కార్యాలయం

- సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న సిబ్బంది
- ఎమ్మార్సీ భవనాన్ని అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన వైనం
- ప్రస్తుతం నిధులు మంజూరైనా స్థలం కేటాయింపులో అధికారుల నిర్లక్ష్యం



శిథిలావస్థకు చేరిన భవనం

దొనకొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సొంత భవనంలేక ఏళ్ల తరబడి పరాయిపంచన మండల విద్యాశాఖ కార్యాలయం కొనసాగుతోంది. మొదట్లో ఎంపీడీవో కార్యాలయంలోని ఒక గదిలో విధులు నిర్వర్తిస్తుండేవారు. 25 సంవత్సరాల క్రితం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైల్వేట్రాక్‌కు సమీపంలో లక్షలు ఖర్చుచేసి ఎమ్మార్సీ భవన నిర్మాణం చేపట్టారు. నిర్మాణ పనులు దాదాపు 75శాతం పూర్తిచేసి అసంపూర్తిగాతో వదిలేయటంతో క్రమేపి శిథిలావస్థకు చేరింది.

ఎంపీడీవో కార్యాలయంలో అన్నిశాఖల నిర్వాహణకు అప్పట్లో గదుల కొరత కారణంగా ప్రక్కనే నిర్మించి నిరుపయోగంగా వదిలేసిన జడ్పీ అతిథిగృహ భవనంలో ఏడాదిపాటు విద్యాశాఖ కొనసాగింది. ఆ భవనానికి మరమ్మతులరీత్యా అక్కడ నుంచి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్వోలు వినియోగిస్తున్న సబ్ ట్రెజరీ భవనంలోకి మార్చారు. అప్పటి తహసీల్దార్ ఆదేశాలతో నాలుగేళ్ళ క్రితం విద్యాశాఖ కార్యాలయాన్ని ఇక్కడికి మార్చి విధులు నిర్వహిస్తున్నారు. మండలంలో 68 ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సమావేశాలు నిర్వహించుకునేందుకు, దాదాపు 5500 మంది విద్యార్థులకు ప్రభుత్వం మంజూరుచేసే విద్యా సామగ్రిని, ఇతర వస్తువులను భద్రపరచుకునేందుకు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రస్తుత ప్రజాప్రభుత్వంలో ఎమ్మార్సీ భవన నిర్మాణానికి రూ. 55 లక్షలు నిధులు మంజూరురయ్యాయి. సంబంధిత అధికారులు వచ్చి ఏ ప్రాంతంలో భవనం నిర్మించాలనే విషయమై విద్యాశాఖ అధికారులతో చర్చించి వెళ్లారు. అయితే, అధికారులు పాత ఎమ్మార్సీ భవనాన్ని పడేసి ఆ స్థలంలో నూతన ఎమ్మార్సీ భవనం నిర్మాణం చేపట్టాలని తెలిపారు. అయితే, ఆ భవనం రైల్వే ట్రాక్‌కు అతి సమీపంలో ఉండటం, భవిష్యత్తులో ట్రాక్ పునరుద్ధరణ జరిగితే ఇబ్బందులు ఎదురవుతాయని ఎంఈవో సాంబశివరావు అధికారుల దృష్టికి తెచ్చి అనువైన స్థలం కేటాయించాలని విన్నవించినట్టు తెలిసింది. ఎమ్మార్సీ భవన నిర్మాణానికి నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా నేటికీ ఉన్నతాధికారులు స్థలం కేటాయింపు గురించి పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, పాలకులు పట్టించుకొని ఎమ్మార్సీ భవనానికి అనువైన స్థలం ఎంపికచేసి నిర్మాణం జరిగేలా తక్షణ చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

టీడీపీలో క్రమశిక్షణతో మెలగాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
- వైసీపీని వీడిన పీసీపల్లి సర్పంచ్



ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన పీసీపల్లి సర్పంచ్ మరియమ్మ

కనిగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణతో మెలగాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పీసీపల్లి మండలంలోని పీసీపల్లి సర్పంచ్ మరియమ్మ వైసీపీని వీడి మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా ఆమెకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సర్పంచ్ మరియమ్మ మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చేస్తున్న అభివృద్ధి, ప్రజాసేవతో పాటు నిస్వార్థమైన పాలన అందిస్తుండటం తనను ఎంతో ఆకర్షించిందన్నారు. ఆయన ఆధ్వర్యంలో టీడీపీ మరింత బలోపేతం కానుందని భావించి ఆయన అడుగుజాడల్లో నడిచేందుకు పూర్తి విశ్వాసంతో టీడీపీలో చేరినట్లు ఆమె పేర్కొన్నారు. పీసీపల్లి పంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి ప్రజాప్రభుత్వం ప్రజాపయోగకర పథకాలను వివరించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని సర్పంచ్ మరియమ్మ పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ పార్టీలో చేరినవారు చేస్తున్న కార్యక్రమాలను అనునిత్యం గమనిస్తామన్నారు. అదేక్రమంలో టీడీపీ బలోపేతానికి కృషి చేసిన వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. కనిగిరి ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి వెళ్ళేలా కలసి పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పీసీపల్లి మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, సానికొమ్ము విజయభాస్కర్‌రెడ్డి, గోగడి రత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

- ఈఈ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసులు

ముండ్లమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌తో పాటు మెరుగైన సేవలు అందించాలని దర్శి డివిజన్ ఈఈ పి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక సబ్‌స్టేషన్‌లో సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా సిబ్బంది పని చేయాలన్నారు. ప్రధానంగా వ్యవసాయ రంగానికి తొమ్మిది గంటల పాటు విద్యుత్‌ను అందించటం, గృహ వినియోగ దారులకు 24 గంటలు విద్యుత్‌ను అందించటం లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలన్నారు. ఇటీవల మొంథా తుఫాన్ వల్ల పలుగ్రామాల్లో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, లైన్‌లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయటం పట్ల ఏఈ చినఅంకబాబు, సిబ్బందిని అభినందించారు.

మండలంలో రూ2 కోట్ల మేర విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయని ఈఈ శ్రీనివాసులు పేర్కొన్నారు. వాటి వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వసూలు చేయాలన్నారు. ఈనెలాఖరు కల్లా 50 శాతం మేర వసూలు చేయాలన్నారు. మూడునెలల పాటు వరుసగా బకాయిలు చెల్లించక పోతే కనెక్షన్ తొలగించాలని చెప్పారు. గృహ వినియోగదారుల ఇళ్ళ మీదుగా వెళ్తున్న లైన్‌లు, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలన్నారు. వ్యవసాయ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు ప్రాధాన్యతాక్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. రైతులకు ఎల్‌సీ ఇచ్చే సమయంలో సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఈ చినఅంకబాబు, లైన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సాంబయ్య, లైన్‌మెన్‌లు పి.అంజనేయులు, కోటేశ్వరరావు, సోమ్లానాయక్, జూనియర్ లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

- టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్



మాట్లాడుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్

కనిగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్ అన్నారు. 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్ విద్యార్థినులకు వ్యాసరచన, డ్రాయింగ్, క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫిరోజ్ మాట్లాడుతూ పుస్తక పఠనం విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. గ్రంథాలయంలో లభించే పుస్తకాలతో ఎంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి కనిగిరి ప్రాంతంలోని విద్యార్థులు విద్యతోపాటు క్రీడారంగంలోనూ రాణించేలా బాటలు వేశారని చెప్పారు. ఇందుకు నిదర్శనమే ఇటీవల ఖోఖో పోటీల్లో జాతీయస్థాయి కప్‌ను కనిగిరి ప్రాంత విద్యార్థులు సాధించారని చెప్పారు.

కార్యక్రమంలో గ్రంథ పాలకుడు షరీఫ్, జేవీవీ నాయకుడు గయాజ్, అంజుమన్‌కమిటీ అధ్యక్షుడు అహ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల హక్కులకు భంగం కలిగిస్తే కఠినచర్యలు



మాట్లాడుతున్న సీడీపీవో సరోజిని

పీసీపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులకు భంగం కలిగిస్తే అట్టివారిపై కఠినచర్యలు తీసుకుంటామని సీడీపీవో సరోజిని అన్నారు. బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా మండలంలోని పెదయిర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వయంకృషి సేవాసంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బడి ఈడు కలిగిన పిల్లలందరినీ తప్పనిసరిగా పాఠశాలకు పంపాలన్నారు. 14సంవత్సరాలలోపు వయసుకలిగిన పిల్లలతో పనులు చేయిస్తే చట్టరీత్యా నేరమన్నారు.ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లైతే వెంటనే ఐసీడీఎస్ సిబ్బంది, పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు, 1098కు సమాచారం ఇవ్వాలని అన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఈసందర్భంగా అన్నపురెడ్డిపల్లి అంగన్‌వాడీ కార్యకర్త సఫల పాఠశాల లైబ్రరీకి పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో అబ్దుల్ సుభాన్, సుమతి, లక్ష్మి, రవణమ్మ, మహాలక్ష్మి, బుజ్జి, రత్తమ్మ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, డాక్టర్ లలిత్‌సాగర్ తదితరులు

పేదల కోసం అహర్నిశలు కృషి చేసిన వంగవీటి రంగా, కనకయ్య

దర్శి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతి కోసం దివంగత నేతలు వంగవీటి మోహనరంగా, కనకం వెంకయ్యలు జీవితాంతం కృషి చేశారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దర్శి-అద్దంకి రోడ్డులో పంచాయతీ రాజ్ కార్యాలయం వద్ద దివంగత నేతల విగ్రహాలఏర్పాటుకు మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా పేద ప్రజల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసి వారి హృదయాల్లో నిలచారన్నారు. దివంగత నేత కనకం వెంకయ్య దర్శి పంచాయతీ సర్పంచ్‌గా సుమారు 20 ఏళ్ల పనిచేసి పేదల అభ్యున్నతికి, దర్శి అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆ మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసే అవకాశం రావటం ఆనందదాయకమన్నారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, మున్సిపల్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, దర్శి సొసైటీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ ఫణిదపు వెంకటరామయ్య, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, మాజీ అధ్యక్షుడు యాదగిరి వాసు, కౌన్సిలర్లు కనకం శ్రీనివాసరావు, వీసీ రెడ్డి, ఎం.శోభారాణి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం శివరాజ్‌నగర్‌లో మురుగుకాల్వల నిర్మాణానికి డాక్టర్ లక్ష్మి శంకుస్థాపన చేశారు.

కందిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

దొనకొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కంది పంటకు వెర్రి తెగుళ్లు సోకిందని మండల వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్ పేర్కొన్నారు. మండలంలోని మల్లంపేట, రుద్రసముద్రం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో కంది పంటను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెర్రి తెగుళ్లు నల్లి ద్వారా వ్యాప్తి చెందుతుందని చెప్పారు. ముందు జాగ్రత్తగా నివారణకు ప్రోప్రగైట్ (ఓమైట్) అనే మందును రెండు ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచకారి చేసి నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎస్.వెంకటరావు, వ్యవసాయ సహాయకులు కె.లాలునాయక్, రవితేజ, విన్నిబాబు, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

పామూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి కుటుంబ సాధికారిక సభ్యులే కీలకమని ఆపార్టీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆదేశాల మేరకు మండలంలోని అయ్యవారిపల్లి కేఎస్ఎస్ సభ్యులతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు.

సమావేశంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, గోళ్ల వీరబాబు, మార్నేని రామకృష్ణ, పువ్వాడి వెంకటేశ్వర్లు, చీమలదిన్నె రవీంద్రబాబు, వేమూరి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా పురుగుమందులు వాడొద్దు!

ముండ్లమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం వర్తిస్తుందని మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు అన్నారు. మంగళవారం మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం, నాయుడుపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన రైతులు సాగుచేసిన మిరప తోటను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కోసం పాసు పుస్తకానికి ఆధార్ నెంబరు లింకు చేసుకొని ఉండాలన్నారు. రైతులు పోటీలు పడి విచ్చలవిడిగా పురుగు మందులు, ఎరువులు వాడవద్దన్నారు. పైర్లు సాగుచేసే ముందు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆపరీక్షల ఆధారంగా సాగు చేసుకున్నట్లయితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో వీవోఏలు శ్రీదేవి, షేక్ ఆఫ్రీన్, డి.మూర్తయ్య, మాలెంపాటి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జనగణనతో పాటు కులగణన చేపట్టాలి

కనిగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జనగణనతో పాటు కులగణను చేపట్టాలని సీపీఐ నాయకులు వై.రవీంద్రబాబు, యాసిన్ డిమాండ్ చేశారు. గిరిజనులు, దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో వారు మాట్లాడారు. అణగారిన వర్గాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. సామాజిక న్యాయం కోసం ఏర్పరుచుకున్న రాజ్యాంగ విలువలను ప్రభుత్వం తుంగలో తొక్కిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం కార్పొరేట్ శక్తులను పెంచి పోషిస్తుందని ఆరోపించారు. వెంటనే ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని కోరారు.

కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, రామారావు, మోహన్, గులాం హసన్, నాజర్, పవన్‌కల్యాణ్, సుబ్బారావు, బషీరా, మస్తాన్ రావు, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

కురిచేడు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా శ్రావణ్ కుమార్

కురిచేడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కురిచేడు తహసీల్దార్ రజనీ కుమారి అనారోగ్య కారణాలతో 15 రోజులపాటు సెలవుపై వెళ్లారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా దర్శి తహసీల్దార్ శ్రావణ్ కుమార్‌ను జిల్లా కలెక్టర్ నియమించారు. విద్యార్థుల ధ్రువపత్రాలకు ఇబ్బంది కలగకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

విద్యార్థులు కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ముండ్లమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మంగళవారం సాయంత్రం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడారు. విద్యార్థులు ప్రయోజకులుగా మారి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యలో అనేక సంస్కరణలు తెచ్చి సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ పాల్గొన్నారు.

కాగా, మండలంలోని పులిపాడుకు చెందిన లక్కిరెడ్డి గంగిరెడ్డి గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా ఎంపిక కావటంతో మంగళవారం దర్శిలోని టీడీపీ కార్యాయలంలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్‌లను ఘనంగా సన్మానించారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుద్దేటి చిననారాయణరెడ్డి, లక్కిరెడ్డి వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం పన్నులు వసూలుచేయాలి

కనిగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మునిపాల్టీ పరిధిలోని 28 వార్డుల్లో రావాల్సిన పన్నుల బకాయిలను నూరుశాతం వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వార్డు ఎమినిటీ, మున్సిపల్ రెవెన్యూ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి పన్నులను ప్రణాళికాబద్ధంగా వసూలుచేయాలన్నారు. నూతనంగా నిర్మించే గృహాలకు వెంటనే పన్నులు విధించాలన్నారు. సమావేశంలో మేనేజర్ ప్రసాద్, ఏఈ కోటేశ్వరరావు, ఆర్ఐ ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.





140 250 మీటర్లా?

- అమరావతి ఓఆర్ఆర్ వెడల్పుపై స్పష్టత కరువు
- గతంలో 140 మీటర్లకే కేంద్ర ప్రభుత్వం ఆమోదం
- 250 మీటర్ల భూసేకరణకు ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదన
- గగ్గోలు పెడుతున్న రోడ్డు ఎలైన్‌మెంట్ బాధిత రైతులు

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమరావతి అవుటర్ రింగురోడ్డు(ఓఆర్ఆర్) వెడల్పుపై స్పష్టత కొరవడింది. కొన్ని నెలల క్రితం కేంద్ర రోడ్డు, రవాణా శాఖ 140 మీటర్ల వెడల్పునకు తుది డీపీఆర్‌ని ఆమోదించింది. అయితే ఇప్పుడు ఆ వెడల్పు కూడా చాలదన్నట్లు బఫర్ జోన్ పేరుతో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) 250 మీటర్ల వెడల్పుతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆమోదం కోసం గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్‌శ్రీవాస్తవకు నివేదించింది. జేసీ ఆమోదం తెలిపితే సర్వే నంబర్లతో భూసేకరణకు ప్రాథమిక నోటిఫికేషన్ విడుదలకు రెవెన్యూ యంత్రాంగం సన్నద్ధమైంది. అయితే ఓఆర్ఆర్ కోసం పావు కిలోమీటర్ వెడల్పు ఎందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీని వల్ల ఎకరాలకు ఎకరాలు భూములు కోల్పోతామని గగ్గోలు పెడుతున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 140 మీటర్లకే లోబడి భూసేకరణ చేసుకోవాలని కోరుతున్నారు. రాజధానికి మణిహారంగా ఉండేలా చేసేందుకు అవుటర్ రింగురోడ్డుని ఏపీసీఆర్‌డీఏ ప్రతిపాదించింది. దాదాపుగా 190 కిలోమీటర్ల పొడవునా గుంటూరు, పల్నాడు, ఉమ్మడి కృష్ణ జిల్లాల మీదగా దీని ఎలైన్‌మెంట్‌ని రూపొందించారు. ఈ ప్రాజెక్టు ఖర్చు రూ.24,791 కోట్లుగా అంచనా వేశారు. ఇందులో భాగంగా కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజ్ ఎగువన, దిగువన రెండు పొడవాటి బ్రిడ్జిలు, రిజర్వు ఫారెస్టులో టన్నెల్స్, రెండు స్పేర్ రోడ్లను నిర్మించేందుకు ప్రతిపాదించారు. మొత్తం 12 ప్యాకేజీలుగా ఓఆర్ఆర్ పనులను విభజించి టెండర్లు పిలిచేందుకు నిర్ణయించారు. తొలుత 100 మీటర్ల వెడల్పుతోనే రింగురోడ్డుని నిర్మించాలని భావించారు. అయితే భవిష్యత్‌లో రైలుమార్గం, ఇతరత్రా అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర మంత్రి నితిన్ గడ్కరితో (మిగతా 6వ పేజీలో)

నేడే.. సుఖీభవ

అన్నదాతలకు ఆర్థిక సాయం

- 1,60,441 మందికి రూ.107.21 కోట్లు
- అర్హుల బ్యాంకు ఖాతాలకు రెండో విడత జమ




(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రైతులకు శుభవార్త. పీఎం-కిసాన్ - అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులను ప్రభుత్వం బుధవారం రైతుల ఖాతాల్లో జమ చేయనున్నది. అన్నదాత సుఖీభవ కింద రూ.5,000, పీఎం-కిసాన్ పథకం కింద రూ.2,000 కలిపి మొత్తం రూ.7,000 అర్హులైన రైతుల ఖాతాల్లో జమ చేయడానికి వ్యవసాయశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. మండల, నియోజకవర్గ స్థాయితో పాటు జిల్లా స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో జరపాలని ప్రభుత్వం ఆదేశించింది. సుఖీభవ సొమ్ము పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రజాప్రతినిధులు సుఖీభవ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులకు వివరించనున్నారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.7 వేల సాయం రబీలో పంటల సాగుకు ఉపయోగపడనున్నాయి. సుఖీభవ పథకం రెండో విడత డబ్బు తమ బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం జమ (మిగతా 6వ పేజీలో)

లబ్ధిదారుల మధ్య వ్యత్యాసం

అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలో మొత్తం 1,60,441 మంది రైతులను లబ్ధిదారులుగా గుర్తించారు. వీరి ఖాతాల్లో రూ.80.22 కోట్లు జమ కానున్నది. పీఎం కిసాన్ పథకం కింద 1,34,925 మందిని అర్హులుగా గుర్తించిన కేంద్రం వీరి ఖాతాల్లో రూ.26.99 కోట్లు వేయనున్నది. ఈ గణాంకాలను పరిశీలిస్తే రెండింటికీ మధ్య 25,516 మంది లబ్ధిదారుల వ్యత్యాసం కనిపిస్తోంది. దాదాపుగా ఇవే అంకెలు తొలి విడత డబ్బులు జమ సమయంలో కూడా యంత్రాంగం ప్రకటించింది. ఆ సమయంలో సాంకేతిక చిక్కుల వల్ల ఈ తేడా వచ్చిందని, రెండో విడత సమయానికి ఈ చిక్కులు పరిష్కార మవుతాయని వ్యవసాయశాఖ తెలిపింది. కానీ అవి పరిష్కారం కాకపోవడంతో జిల్లాలో పలువురు రైతులకు రెండో విడతలోనూ నిరాశే ఎదురవనున్నది. కాగా జిల్లా స్థాయిలో కార్యక్రమం బాపట్లలో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కార్యక్రమ ఏర్పాట్లపై అధికారులు నిమగ్నమయ్యారు.



ఇదేం ప్రశ్నపత్రం

- చేతిరాతపై విద్యార్థుల అవాక్కు
- పునరావృతం కాదన్న పీజీ కోఆర్డినేటర్

ఏఎన్‌యూ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పరీక్షలు.. అదేదో ప్రాథమిక స్థాయి విద్యార్థులకు సంబంధించినవి కాదు. అలాంటి పరీక్షలకు సంబంధించి కూడా అధికారులు అప్రమత్తంగా ఉంటారు. అలాంటిది పీజీ కోర్సులకు సంబంధించి, అదీ విద్యార్థులకు కీలకమైన సెమిస్టర్ పరీక్షలంటే ఎంతో జాగ్రత్తగా ఉంటారు. అయితే ఘనత వహించిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్లక్ష్య ధోరణి వీడటంలేదు. వర్సిటీ పరీక్షల విభాగం నిర్లక్ష్యం ఎంత అధ్వానంగా మారిందంటే సెమిస్టర్ పరీక్షల ప్రశ్నపత్రాలను కూడా చేతిరాతతో ఇచ్చారు. పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులు చేతిరాతతో ఇచ్చిన ప్రశ్నపత్రం చూసి అవాక్కయ్యారు. వర్సిటీలో మంగళవారం పీజీ ఆర్ట్స్ సైన్స్ ఎంబీఏ, ఎంసీఏలతో పాటు ఎల్.ఎల్.బీ కోర్సులకు సంబంధించి మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అయితే సైన్స్ విభాగం ఫుడ్ అండ్ న్యూట్రిషన్ ప్రశ్నపత్రం చేతితో రాసినది చూసి విద్యార్థులు విస్తుపోయారు. చివరకు విద్యార్థులకు నచ్చచెప్పిన అధ్యాపకులు వారితో పరీక్ష రాయించారు. ఆ ప్రశ్నపత్రాన్ని చూసి అధ్యాపకులు కూడా కంగుతున్నారు. ఈ ప్రశ్నపత్రంపై ఆరా తీయగా గతంలో ప్రశ్నపత్రాల లీకేజీకి సంబంధించిన అధ్యాపకుడే కారణమని తెలిసింది. దీనితో విద్యార్థులు అసహనానికి గురయ్యారు. దీనిపై పీజీ కోఆర్డినేటర్ సుబ్బారావును వివరణ కోరగా సమయం తక్కువ ఉండటంతో రాత పూర్వకంగా ఇచ్చినట్లు తెలిపారు. ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా చూసుకుంటామన్నారు.



మావోల షెల్టర్‌పై.. ఉలికిపాటు

- కలకలం రేపిన విజయవాడ ఘటన
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో పరిస్థితులపై పోలీసుల ఆరా
- నాడు మావోలకు పెట్టనికోటగా పల్నాడు, నల్లమల ప్రాంతం

బాపట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని తోపాటు రాష్ట్రంలోనే అత్యంత కీలక ప్రాంతం విజయవాడలో మావోయిస్టులు షెల్టర్ తీసుకున్న ఉదంతం పోలీస్ శాఖతో ప్రజలను కూడా ఉలిక్కిపడేలా చేసింది. విజయవాడలో ఏకంగా 27 మంది మావోయిస్టులను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకోవడం సంచలనంగా మారింది. గతంలో రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు తీవ్రస్థాయిలో ఉన్న సమయంలోనూ విజయవాడ లాంటి నగరంలో ఇంత భారీ సంఖ్యలో మావోయిస్టులు పట్టుబడిన పరిస్థితి లేదు. ప్రధానంగా ఛత్తీస్‌ఘడ్, ఏవోబీ ప్రాంతాల్లో కేంద్ర పోలీస్ బలగాల ముప్పేట దాడులతో ఇప్పటికే మావోయిస్టులు ఉనికి కోల్పోయే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. వందలాది మంది ఎన్‌కౌంటర్లలో హతమవగా, అదే స్థాయిలో లొంగుబాటు పర్వం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఊహించని విధంగా మావోయిస్టుల అత్యంత కీలక నేత హిడ్మా సహా ఆరుగురు ఎన్‌కౌంటర్లో మృతి చెందడం.. అదే సమయంలో విజయవాడలో 27 మంది పోలీసులకు పట్టుబడటం కలకలం రేపింది. ఈ ఘటన నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో పోలీస్ శాఖ అప్రమత్తమైంది.

గతంలో నల్లమల కీలకమైన ప్రాంతం

ఒకప్పుడు మావోయిస్టులకు పెట్టని కోటగా... షెల్టర్ జోన్‌గా ఉన్న నల్లమల ప్రాంతంలో దాదాపు ఒకటిన్నర దశాబ్దంగా వారి ఉనికే లేకుండా పోయింది. గతంలో నల్లమల కేంద్రంగా మావోయిస్టులు కార్యకలాపాలు సాగించారు. నల్లమలను ఆసరాగ పల్నాడు ప్రాంతంలో పూర్తిస్థాయిలో విస్తరించి పోలీస్ శాఖకు సవాల్‌గా నిలిచారు. దివంగత మావోయిస్టు అగ్రనేత అక్కిరాజు హరగోపాల్ అలియాస్ ఆర్కే పల్నాడు ప్రాంతవాసి కావడంతో ఈ ప్రాంతంపై మావోయిస్టులు తమదైన శైలిలో ముద్రవేశారు. అటు తెలంగాణ సరిహద్దు జిల్లాలతో పాటు ఇటు ఏపీలోని సరిహద్దు జిల్లాల మధ్య విస్తరించి ఉన్న నల్లమల ప్రాంతం గతంలో మావోయిస్టులకు షెల్టర్‌జోన్‌గా ఉంది. ఇక్కడ నుంచే మావోయిస్టులు పెద్దఎత్తున కార్యకలాపాలు సాగించారు. 2004లో ప్రభుత్వంతో మావోయిస్టు చర్చలు విఫలం తర్వాత మావోయిస్టుల అనుపానులు తెలుసుకుని నల్లమలలో వారి షెల్టర్‌కు గండి కొట్టారు. దీంతో వారంతా ఈ ప్రాంతాన్ని వదిలి ఏవోబీ వైపు వెళ్లారు. 2010 నుంచే పల్నాడు ప్రాంతంలో మావోయిస్టుల కార్యకలాపాలు కనుమరుగవుతూ వచ్చాయి. అదే సమయంలో తెలంగాణలో కూడా పూర్తిగా మావోయిస్టు కార్యకలాపాలను అణిచి వేయడంతో ఏపీ, తెలంగాణలో మావోయిస్టులకు షెల్టర్ లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో తాజాగా విజయవాడలో 27 మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఒకప్పుడు మావోయిస్టు ప్రాబల్య ప్రాంతమైన ఉమ్మడి గుంటూరు జిల్లాలో పరిస్థితులు చర్చనీయాంశమయ్యాయి. అయితే విజయవాడలో మావోయిస్టులు పట్టుబడిన సందర్భాన్ని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని పోలీసు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఛత్తీస్‌ఘడ్, ఏవోబీ ప్రాంతంలో పోలీస్ దాడులు పెరగడంతో ప్రాణ రక్షణ కోసం మావోయిస్టులు మైదాన ప్రాంతం వైపు వచ్చి ఉంటారని... పరిస్థితులు అనుకూలిస్తే లొంగిపోవాలని భావించి ఉంటారని పోలీసు వర్గాలు అంటున్నాయి. నల్లమల ప్రాంతంలో మావోయిస్టుల ఉనికే లేదని.. అలాగే పల్నాడు ప్రాంతంలో వారికి షెల్టర్ అవకాశమే లేదని నిఘావర్గాలు అంచనా వేస్తున్నాయి. ఒకవేళ ఎవరైనా రహస్యంగా ఈ ప్రాంతానికి వచ్చినా ప్రజలే పోలీసులకు సమాచారం ఇచ్చి పట్టించే పరిస్థితులు ఉన్నాయంటున్నారు.

క్రీడలతో మానసిక ఆరోగ్యం

- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో మానసిక ఆరోగ్యం మెరుగుపడాలంటే తప్పనిసరిగా క్రీడలు నిర్వహిస్తుండాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. మానసిక ఆరోగ్యంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వీ వినోద్‌కుమార్

మాట్లాడుతూ విద్యార్థుల్లో సమానత్వం, ఐక్యతపై అవగాహన కల్పించాలని చెప్పారు. భవిష్యత్ సమాజ నిర్మాణం తరగతి గదుల్లోనే ప్రారంభమౌతుందనే విషయాలను అధికారులు గుర్తించాలన్నారు. 100 మంది విద్యార్థులు దాటితే తప్పనిసరిగా ఆ విద్యా సంస్థలో ఒక సైకియాట్రిస్టు ఉండాలన్నారు. మానసిక ఒత్తిడికి గురయ్యే, ఆత్మహత్య ఆలోచన వచ్చే విద్యార్థుల కోసం టోల్‌ఫ్రీనెంబరు 14416 టెలీమానస్ సేవలు ఉచితంగా ఉపయోగించుకోవచ్చన్నారు. డిసెంబరులో మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ నిర్వహించడానికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలి :కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

- అన్నదాత సుఖీభవ, పీఎమ్ కిసాన్ ఆర్థికసాయం రెండో విడత పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
- వాల్టా చట్టం ఆధారంగా ఇసుకరేవులు అనుమతించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జువ్వలపాలెంలో 14.960, చిలుమూరులో 4.9, గాజుర్లంక-బీ ప్రాంతంలో 4.9 హెక్టార్ల ఇసుక లభ్యత ఉందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ తదుపరి ఆప్రాంతం నుంచి ఇసుక తవ్వడానికి అనుమతి ఉంటుందన్నారు. ఓలేరు రేవులో ఇసుక తవ్వకాలకి ముందస్తు పరిశీలన చేయాల్సి ఉందన్నారు. కొల్లూరు మండలంలోని చిలుమూరు, గాజుర్లంక వద్ద మూడురేవులను గుర్తించామని చెప్పారు. వాల్టా చట్టం ఆధారంగా పర్యావరణ అనుమతులను పరిశీలించాలన్నారు. రేవులు ఉన్న ప్రాంతాల్లో సీసీకెమెరాలు ఉంచాలన్నారు. ఆయా సమావేశాల్లో జేసీ భావన వశిష్ఠ, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డాక్టర్ జుబేర్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, జిల్లా వ్యవసాయాధికారి అన్నపూర్ణ, మార్క్‌ఫెడ్ డీఎమ్ కరుణశ్రీ, జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్యామ్ సన్, సేంద్రియ వ్యవసాయ డీపీఎమ్ హాన్సేన్, జిల్లా పశుసంవర్థక అధికారి డాక్టర్ వేణుగోపాల్, జిల్లా గనులు, భూగర్భశాఖాధికారి బి.రామచంద్ర, భూగర్భజలశాఖ ఏడీ సురేష్, డీటీవో పరందామరెడ్డి, డీపీవో ప్రభాకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు తదితరులు పాల్గొన్నారు.



తీరంలో పర్యాటకుల సందడి (పాతచిత్రం)

ఆంక్షలు.. తొలగింపు

- నేటి నుంచి పర్యాటకులకు అనుమతి
- మొంథా తుఫాన్‌తో బీచ్‌ల మూత
- వేటకు సిద్ధమవుతున్న మత్స్యకారులు

వాడరేవు(చీరాల), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్‌తో 20 రోజులుగా వాడరేవు, రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం పరిధిలోని తీరంలో విధించిన ఆంక్షలను బుధవారం నుంచి సడలించారు. దీంతో గతంలో మాదిరిగా ఆయా బీచ్‌లు పర్యాటకులతో కళకళలాడనున్నాయి. ఆంక్షలతో మూతపడిన రిసార్ట్స్ యథావిధిగా తెరుచుకోనున్నాయి. కార్తీక మాసంలో పుణ్యస్నానాలపై ఆంక్షలు విధించారు. ఈ క్రమంలో అధికారులు తీరంలో పర్యటించి పరిస్థితులు అనుకూలంగా మారడంతో బుధవారం నుంచి కొన్ని నిబంధనలను అనుసరిస్తూ ఆంక్షలు ఎత్తివేశారు. ఆంక్షలు తొలగింపుతో మత్స్యకారులు వేటకు సిద్ధమయ్యారు. దాదాపుగా 20 రోజుల పాటు తుపాన్ ప్రభావంతో బోట్లు ఒడ్డుకు చేరాయి. వేట లేక పూట గడవక నానా యాతన పడ్డారు. అనుమతి లభించడంతో మత్స్యకార గ్రామాల్లో సందడి నెలకొంది.

నిబంధనలు అనుసరించే అనుమతి

తీరంలో పరిస్థితులు పూర్తిగా చక్కబడలేదని, నిబంధనలు అనుసరించే అనుమతి ఇచ్చినట్లు ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. మూడు చోట్ల వంతెనలు కూలాయని, జాతీయ రహదారి 167ఏ జీరో పాయింట్ వద్ద చప్టా ఇబ్బందిగా ఉందన్నారు. పర్యాటకులు ఆయా ప్రతికూలతలు గమనించి నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే స్నానాలు ఆచరించాలన్నారు.

శింగరకొండ.. దేదీప్యం

- భారీగా మహిళలు వైభవంగా కోటి దీపోత్సవం
- అరుణాచలంలో వలే నిర్వహించాలన్న కృష్ణస్వామి



అద్దంకి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శింగరకొండలో కోటి దీపోత్స వం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది.



కోటి దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న కృష్ణస్వామి

ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం దక్షిణ రాజగోపురం ముందు దీపోత్సవం నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి మహిళా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దీపోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ప్రసన్నాంజనేయస్వామికి రుద్రాక్షలతో అలంకరించారు. కోటి దీపోత్సవాన్ని లక్ష్మ వరం కాశీవిశ్వేశ్వరాలయం కృష్ణస్వామి ప్రారంభించి ప్రసంగించారు. ఎంతో విశిష్టత ఉన్న శింగరకొండలో కూడా అరుణాచలం నిర్వహించినట్లుగా దీపోత్సవం నిర్వహించాలన్నారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ చుండూరి మురళీసు ధాకరరావు, ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు, పూజారులు పాల్గొన్నారు. సీఐ సుబ్బరాజు ఆధ్వ ర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం జరిగింది.

సకాలంలో పాఠశాలకు చేరుకోవాలి

- ఉచితంగా సైకిళ్ల పంపిణీ ఉద్దేశమిదే
- విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి సూచన

పంగులూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సకాలంలో పాఠశాలకు చేరేందుకే విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండలంలోని ముప్పవరం గ్రామంలోని పీఎస్ఎస్‌సీసీ ఉన్నత పాఠశాలలో 110 మంది విద్యార్థులకు మంగళవారం ఉచితంగా సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటలీకి చెందిన ఐఎస్‌పీ, నెడ్‌క్యాప్ సంస్థల సహకారంతో ముప్పవరం విద్యార్థులకు సైకిళ్లు అందించినట్లు తెలిపారు. రవాణా సౌకర్యం లేక విద్యకు



ముప్పవరంలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి

విద్యార్థులు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఉచితంగా సైకిళ్లను సమకూర్చినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 10వేల మంది విద్యార్థులకు సైకిళ్లను అందజేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 5,100 మందికి అందచేశామన్నారు. సైకిళ్లపై పాఠశాలకు చేరుకునే విద్యార్థులు రహదారి భద్రతా నిబంధనలు పాటించాలన్నారు.

అండర్‌పాస్ ఏర్పాటుకు వినతి

విజయవాడ, బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పాఠశాలకు సమీపంలో జరుగుతున్నందున విద్యార్థులు ఇబ్బంది పడకుండా అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసిస్ట్ డైరెక్టర్లు విష్ణుప్రియ, జయకృష్ణహరీష్, రామారావు, ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దార్ సింగారావు, సుమంత్, ఎంఈవో వీరాంజనేయులు, హెచ్‌ఎం.ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కేవీ.సుబ్బారావు, ధూళిపాళ్ళ రామచంద్రప్రసాద్, కుక్కపల్లి ఏడుకొండలు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, డీసీ ఛైర్మన్ కుక్కపల్లి ఆంజనేయులు, గరిమిడి జగన్, గుర్రం ఆదిశేఖర్, చింతల సహదేవుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు రావుల శింగరకొండ, బత్తుల వెంకటరావు, గొల్లపూడి అంజయ్య, జాగర్ల మూడి శ్రీను, సింగర్, వలపర్ల సుబ్బారావు, రవి, ఆదిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, బంగారురాజు, ధూళిపాళ్ల స్వామి, శ్రీను, కోమటిప్రసాద్, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

విద్యార్థులకు సాంకేతిక విద్య అవసరం



మాట్లాడుతున్న హోమియో వైద్యులు డాక్టర్ రఘుచంద్

అద్దంకిటౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సాంకేతిక విద్య అవసరమని హోమియో వైద్యులు డాక్టర్ కావూరి రఘుచంద్ అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం అద్దంకి శాఖ గ్రంథాలయంలో ఐదవ రోజు విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృ భాష ఎంత ముఖ్యమో విద్యార్థుల ఎదుగుదలకు జాతీయ భాష హిందీ, ఇంగ్లీష్ కూడా అంతే అవసరమన్నారు. ఆయా భాషలు నేర్చుకోవడం ద్వారా విద్యార్థులు వారి లక్ష్యాన్ని చేరుకోగలరన్నారు. నేటి సమాజం గ్రంథాలయల అవశ్యకత అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముండవల్లి రాజు, డాక్టర్ యు.దేవపాలన, ప్రోగ్రాం ఆర్గనైజర్ మన్నం త్రిమూర్తులు, గ్రంథపాలకురాలు సీహెచ్‌వీఎల్ వసుంధరదేవి, గాడేపల్లి దివాకర్ దత్తు, మలాది శ్రీనివాసరావు, రామారావు, బాబురావు, ప్రసాద్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో పన్ను చెల్లింపుపై అవగాహన



క్యూఆర్ కోడ్‌తో అవగాహన కల్పిస్తున్న అధికారులు

పంగులూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో (క్యూఆర్‌కోడ్) ద్వారా ఇంటిపన్ను చెల్లింపునకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎంపీడీవో స్వరూపారాణి అన్నారు. మండలంలోని ముప్పవరం సచివాలయ సిబ్బందికి మంగళవారం అసెస్మెంట్ నెంబరుతో ఆన్‌లైన్‌లో పన్ను చెల్లింపు విదానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె.సుమంత్, పంచాయతీ కార్యదర్శి జానీబేగం, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో అపార్ పెండింగ్ లేకుండా చూడాలి



సీఆర్‌పీలతో మాట్లాడుతున్న ఏఎంవో కాశీం

అద్దంకిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి పాఠశాలలో ఆపార్ ఐడి పెండింగ్ లేకుండా చూడాలని బాపట్ల జిల్లా సమగ్ర శిక్ష ఏఎంవో(ఉర్దూ) ఎస్‌కే కాశీం అన్నారు. మంగళవారం అద్దంకిలోని గురుకుల పాఠశాల, ఎంపీపీఎస్ (కాకానిపాలెం), జెడ్పీహెచ్‌ఎస్ (తిమ్మాయపాలెం)లను ఆయన సందర్శించారు. స్కూల్ గ్రాండ్స్, ఆపార్ ఐడి, ఎస్‌ఆర్ కేవీఎం బయోమెట్రిక్ అథెంటికేషన్ గురించి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో చర్చించి పలు సూచనలు చేశారు. అనంతరం ఎంఆర్‌సీలో ఎంఈవో కార్యాలయం సిబ్బంది, సీఆర్‌పీలతో రివ్యూ సమావేశం నిర్వహించారు. స్కూల్ గ్రాండ్స్ బిల్లులు అన్ని 19వ తేదీ లోపు అప్‌లోడ్ చేయాలని సూచించారు.

పలు దుకాణాల్లో ఎస్సై తనిఖీ

బల్లికురవ, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు వంద మీటర్ల దూరంలో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ వై.నాగరాజు హెచ్చరించారు. మంగళవారం ఎస్‌ఐ నాగరాజు బల్లికురవ నాలుగు రోడ్ల కూడ లిలో ఉన్నత పాఠశాల సమీ పంలో ఉన్న పలు దుకాణాలను తనిఖీలు చేశారు. సిగిరెట్లు, మరియు గుట్కాలను అమ్మకాలు చేయకుండా ఉండేందుకు దుకా ణాల వారికి అవగాహన కల్పిస్తు న్నామని, విద్యార్థులు ఎవరు చెడు వ్యసనాలకు గురి కాకుండా ఉండేలా ప్రజలందరూ కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలన్నారు.

140 మీటర్లా.. 250 మీటర్లా?

(5వ పేజీ తరువాయి)

చర్చించి 140 మీటర్ల వెడల్పునకు ఆమోదం పొందారు. కాగా ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు ఏకంగా 250 మీటర్ల వెడల్పుతో తుది డీపీఆర్‌ని సిద్ధం చేసి కేంద్రం నుంచి ఆమోదం తీసుకుని గుంటూరు జిల్లా రెవెన్యూ యంత్రాంగానికి నివేదించారు. దీని వల్ల భూసేకరణ ఖర్చులు పెరిగిపోతాయి. పైగా భూమినే నమ్ముకుని తరతరాలుగా జీవిస్తోన్న రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. అలానే పరిశ్రమలు, వాటర్ బాడీస్‌కి కూడా నష్టం జరగొచ్చు. ఈ నేపథ్యంలో ప్రతిపాదిత ఓఆర్‌ఆర్ ఎలైన్‌మెంట్‌పై రైతులు ఆగ్రహంగా ఉన్నారు. 140 మీటర్ల వెడల్పులోనే మీడియన్‌తో ఆరు వరుసల రహదారి, ఇరువైపులా సర్వీసు రోడ్లు, రైలుమార్గానికి సరిపోతుంది. అలాంటిది దీని కంటే 110 మీటర్లు అదనంగా భూసేకరణ చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదించడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే రెవెన్యూ అధికారులు తమతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని కోరుతున్నారు.

నేడే.. సుఖీభవ

(5వ పేజీ తరువాయి)

చేస్తుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న గందరగోళం

లబ్ధిదారుల సంఖ్యలో తొలి దశలో ఉన్న గందరగోళమే ఇప్పటికీ కొనసాగుతోంది. అన్నదాత సుఖీభవ లబ్ధిదారులకు, పీఎం కిసాన్ లబ్ధిదారులకు మధ్య భారీ సంఖ్యలో వ్యత్యాసం ఉంది. వెబ్‌ల్యాండ్ వంటి సాంకేతిక చిక్కులతో పాటు కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పీఎం కిసాన్ లబ్ధిదారుల ఎంపిక జరిగిందని గతంలో యంత్రాంగం చెప్పింది. 2019 నుంచి ఉన్న వెబ్‌ల్యాండ్ డేటానే కేంద్రం ప్రామాణికంగా తీసుకుంటుందని, అందువల్లే లబ్ధిదారుల సంఖ్యలో తేడా ఉందని అధికారులు చెప్తున్నారు. రెండో దశ నిధులు విడుదల నాటికీ ఈ సమస్య పరిష్కారం అవుతుందని అప్పట్లో తెలిపారు. కానీ తొలి దశలోని లబ్ధిదారుల సంఖ్యనే ఇప్పుడు కూడా వ్యవసాయశాఖ చూపిస్తోంది. తొలి దశ రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యాక, అర్హత కలిగిన ఎవరికైనా సుఖీభవ నిధులు పడకపోతే దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దాని ఆధారంగా పలువురు రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, వారి అర్హతను నిర్ధారించారు. అయితే తాజా లబ్ధిదారుల్లో వారి పేర్లు కనిపించడంలేదు. అభ్యంతరాల ద్వారా అప్పుడు అర్హులుగా తేలిన వారు, మలి విడతలో ఎందుకు అనర్హులయ్యారనేదానికి వ్యవసాయశాఖ సమాధానం చెప్పాల్సి ఉంది. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే కౌలు రైతుల జాబితాలు ఇంకా సిద్ధం కానట్లు తెలుస్తోంది. కౌలు రైతులకు ఒకేసారి రూ.14 వేలు అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే రెండో విడతలో కౌలు రైలుకు సుఖీభవ అందుతుందా లేదా అన్న అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఈ సారి లేకుంటే మూడో విడతలో వారికి సుఖీభవ అందించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

అన్నదాత.. సుఖీభవ

- నేడు రైతుల ఖాతాలకు నిధులు
- రైతుసేవా కేంద్రాల్లో అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యక్ష ప్రసారం



పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఏవో వెంకటకృష్ణ

అద్దంకిటౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండవ విడత నిధులు ఈ నెల 19న విడుదలవుతాయని మండలంలో 9579 మంది రైతులకు రూ.6.67 కోట్లు వారి ఖాతాలల్లో నగదు జమ చేయనున్నట్లు ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని వెంపరాల, చక్రాయపాలెం గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలల్లో సాగు చేస్తున్న పలుపంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కడప జిల్లాలో సీఎం చంద్రబాబునాయుడు ఈ పథకం నిధులు రైతుల ఖాతాలల్లో జమ చేస్తారన్నారు. 19వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యాన్ని రైతుసేవా కేంద్రాలలోనే అమ్ముకోవాలని సూచించారు. గ్రేడ్ ఏ రకం క్వింటా రూ.2389, గ్రేడ్ బీ రకం రూ.2369ల మద్దతు ధర అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏలు ప్రసన్న, శివాని రైతులు పాల్గొన్నారు.

చీరాల : నేడు అన్నదాత సుఖీభవ రెండవ విడత నిధులు విడుదల చేయనున్నట్లు వ్యవసాయశాఖ చీరాల సబ్‌డివిజన్ ఏడీఏ టి.రత్నకుమారి తెలిపారు. వేటపాలెం, చీరాల మండల ఏవోలు నిర్మలదేవీ, సరిత ఆధ్వర్యంలో అందుకు సంబంధించి నియోజక వర్గస్థాయి సమావేశం చీరాల మండలం బోయిన వారిపాలెంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 1 గంట నుండి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని రైతులు విజయవంతం చేయాలని కోరారు.



బల్లికురవలో మాట్లాడుతున్న ఏవో యలమందారెడ్డి

నేడు అన్నదాత సుఖీభవ లైవ్‌స్ట్రీమింగ్

పంగులూరు : అన్నదాత సుఖీభవ నిధుల విడుదలపై లైవ్‌స్ట్రీమింగ్ కార్యక్రమం బుధవారం రైతు సేవాకేంద్రాలలో ఏర్పాటు చేసినట్లు ఏవో డి.సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలో 7,267 మంది రైతులకు రూ.4.97 కోట్ల మొత్తం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 19న రైతుల ఖాతాలలో నగదు జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ విడత రైతుల ఖాతాలో రూ.7వేలు జమ అవుతాయన్నారు.

బల్లికురవ : మండలంలో 8367 మందికి అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం నగదు జయ చేయనున్నట్లు ఏవో బత్తుల యలమందారెడ్డి పేర్కొన్నా రు. మంగళవారం మండలంలోని నక్కబొక్కల పాడు, బల్లికురవ గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రైతులతో మాట్లాడుతూ ఈ విడత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాత సుఖీభవ, పీఎంకిసాన్ పథకం ద్వారా మొత్తం రూ.7వేలు జయచేయనున్నట్లు తెలిపారు.

బల్లికురవ : మండల ఇన్‌చార్జ్ ఏవోగా బత్తుల యలమందారెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న ఏవో శ్రీనివాసరావు రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి మెడికల్ లీవ్‌పై వెళ్లడంతో అధికారులు మార్టూరు ఏడీఏ కార్యాలయంలో టెక్నికల్ ఏవోగా పనిచేస్తున్న యలమందారెడ్డిని బల్లికురవ మండలానికి నియమించారు.

అద్దంకి: శింగరకొండ లక్ష్మీనరశింహస్వామి దేవాలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా మంగళవారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవంలో ఆరుగురు దంపతులు పాల్గొన్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ఈవో మద్దినేని శ్రీనివాసరావులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

యద్దనపూడి మండలంలో

యద్దనపూడి,(మార్టూరు) : యద్దనపూడి మండలంలో అన్నదాత సుఖీభవ, పీఎంకిసాన్ పథకానికి రూ.2.86 కోట్లు నిధులు రైతుల ఖాతాలకు జమకానున్నాయని ఏవో కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారిలో అన్నదాత సుఖీభవ కింద 4227 మంది రైతులకు రూ.2.11 కోట్లు, పీఎం కిసాన్ కింద 3747 మంది రైతులకు రూ.75 లక్షలు వారి ఖాతాలలో జమకానున్నాయి.

రూ.5.29 కోట్లు నిధులు మంజూరు

మార్టూరు : మండలంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద రూ.5.29 కోట్లు లబ్ధిదారుల ఖాతాలలో జమకానున్నాయని ఏవో ఆర్.లావణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో విడత నిధులు బుధవారం రైతుల ఖాతాలకు జమకానున్నాయి. ఈ మేరకు మండలంలో అన్నదాత సుఖీభవ లబ్ధిదారులు 7688 మందికి 3.84 కోట్లు, పీఎం కిసాన్ లబ్దిదారులు 7211 మందికి 1.44 కోట్లు రైతుల ఖాతాలలో జమకానున్నాయి.

దేవరపల్లి ఎత్తిపోతల పథకం అభివృద్ధికి శ్రీకారం



పైప్‌లైన్ మరమ్మతులు చేస్తున్న ఎక్స్‌కవేటర్

దేవరపల్లి(పర్చూరు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వేల ఎకరాలకు సాగునీటిని అందించే దేవరపల్లి ఎత్తిపోతల పథకం అభివృద్ధికి ప్రజాకూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకం కనీస మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ఈ పథకం దిగువ గ్రామాలైన దేవరపల్లి, తన్నీరువారిపాలెం, ఏదుబాడు తోట, గుంటూరు జిల్లా పరిధిలోని పరిటాల వారిపాలెం, ఉప్పలపాడు గ్రామాలకు ఈ పథకం సంజీవనే అని చెప్పాలి. ఎంతో ప్రాధ్యానత ఉన్న ఈ పథకం గతంలో నిర్లక్ష్యానికి గురికావడంతో కునారిల్లే పరిస్థితి వచ్చింది. దీనికి తోడు ఇటీవల తుఫాను, వరదల కారణంగా ఎత్తిపోతల పథకం పెద్దఎత్తున మరమ్మతులకు గురైంది. ఈ నేపథ్యంలో ఎత్తిపోతల పథకం పరిస్థితిని చైర్మన్ గోను గుంట్ల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో ఎత్తి పోతల పథకానికి మరమ్మ తులు చేస్తున్నారు. రబీలో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సాగు నీటిని అందించే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు నేతలు తెలిపారు. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి.

నిరక్షరాస్యత నిర్మూలన సామాజిక బాధ్యత

ఎంపీడీవో స్వరూపారాణి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో వెలుగు సిబ్బంది

పంగులూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఎంపీడీవో కే.స్వరూపారాణి అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో వయోజనవిద్య కార్యక్రమాల అమలుపై వీవోఏలకు మంగళ వారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నిరక్ష్యరాస్యులైన వయోజనుల దైనందిన జీవితంలో ఉపయోగపడేలా చదవడం, రాయడం, సంఖ్యా పరిజ్ఞానం నేర్పించేందుకు వలంటీర్లు స్వచ్ఛందంగా కృషి చేయాలన్నారు. సూపర్‌వైజర్ మనో రంజన్‌బాబు మాట్లాడుతూ మండలంలో 2,460 మంది నిరక్ష్యరాస్యులను గుర్తించామని, పదిమంది అభ్యాసకులకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి విద్యా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో ఎలిజిబెత్‌రాణి, ఎంఈవో వీరాంజనేయులు, ఏపీఎం కోటేశ్వర రావు, సీసీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, తెలుగు పద్య పోటీలు



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు

చినగంజాం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : చినగంజాం శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు గ్రంథపాలకుడు మోహనలక్ష్మీనరసింహాచార్యులు పలు పోటీలు నిర్వహించారు. రాజుబంగారుపాలెం ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు 'గ్రంథాలయ ఉద్యమకారులు' అనే అంశంపై వక్తృత్వ పోటీలు, ప్రకృతి వైపరీత్యాలు ఎదురుకోవలసిన పద్ధతులు అనే అంశంపై వ్యాసరచన పోటీలు, అడవీధిపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తెలుగు పద్య పోటీలు, చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'నచ్చిన బొమ్మ' అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతలైన విద్యార్థులకు ముగింపు వేడుకలలో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆర్‌వీఎస్.పోతురాజు, మల్లారెడ్డి, చుండూరి వెంకట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటిజం కేంద్రాల నిర్వహణపై అప్రమత్తం

- జిల్లాలో మొత్తం నాలుగు కేంద్రాల ఏర్పాటు
- ఈపూరుపాలెం కేంద్రాన్ని పరిశీలించిన రాష్ట్ర అధికారి



ఆటిజం సెంటర్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రత్యేక అధికారి రామ్‌కమల్

ఈపూరుపాలెం(చీరాల), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆటిజం కేంద్రాలతో పిల్లల మానసిక స్థితిగతులను సక్రమం చేసేందుకు వీలుంటుందని రాష్ట్ర ప్రత్యేక అధికారి రామ్ కమల్ పేర్కొన్నారు. మంగళవారం చీరాల మండలం ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న ఆటిజం కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో బాపట్ల, రేపల్లె, అద్దంకిచ చీరాల ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో కేంద్రానికి రూ.25 లక్షల వ్యయం వెచ్చించగా, సిబ్బంది ఏర్పాటు త్వరలోనే జరుగుతుందని వివరించారు. కేంద్రాల ద్వారా పిల్లలకు ఫిజియోథెరపీ, బిహేవియర్ మాడిఫికేషన్స్ వంటివి నిర్వహణ జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఈఈ నాగజ్యోతి, స్టేట్ అసిస్టెంట్ ఐఈ కో-ఆర్డినేటర్ మల్లికార్జున, జిల్లా ప్రతినిధి జ్యోత్స్న, ఎంఈవో 2 సుధారాణి, హెచ్‌ఎం హనోరా తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన, రుద్రాభిషేకం



విశ్వేశ్వరునికి లక్ష బిల్వార్చన, శింగరకొండపై నరసింహస్వామి కల్యాణం

బల్లికురవ, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకొని మండలంలోని గుంటుపల్లి అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ పూజారులు పేటేటి సుధాకర్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారిని అమ్మవారిని ప్రత్యేకంగా ఆలంకరించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపోత్సవం

అద్దంకి : పట్టణంలోని వేయిస్తంభాల గుడిలో మంగళవారం కోటి వత్తులతో దీపోత్సవం నిర్వహించారు. పూజారి సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో కేరళ నుంచి తీసుకొచ్చిన కోటివత్తులతో మంగళవారం రాత్రి దీపోత్సవము నిర్వహించారు. దీపాలతో ఏర్పాటు చేసిన శివలింగాకారం ప్రత్యేక అలంకరణ ఆకర్షణగా నిలిచింది. భక్తులు పెద్ద సంఖ్యలో హజరై దీపోత్సవము తిలకించారు. శింగరకొండపై లక్ష్మి నరసింహస్వామికల్యాణం నిర్వహించారు.

రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



కారం మిల్లును అందజేస్తున్న సుబ్బారెడ్డి, ఏపీఎం

చినగంజాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా మహిళలు ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకొని ఆరికంగా అభివృద్ధి చెందాలని తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని పెద గంజాం గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన జొన్నలగడ్డ శ్యామలకు పీఎంఎఫ్‌ఎంఈ పథకం ద్వారా రాయితీపై అందజేసిన కారం, పిండి మిల్లులను మంగళవారం ఆయన యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఉప్పుగుండూరు శాఖ ఫీల్డ్ ఆఫీసర్ శ్రవణ్‌తో కలిసి అందజేశారు. శ్యామలకు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఉప్పుగుండూరు శాఖ వారి సహకారంతో రాయితీపై అందజేసినట్లు ఏపీఎం గద్దె పెదసుబ్బారావు తెలిపారు. వెలుగు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పీఎంఎఫ్‌ఎంఈ పథకం కింద రూ.1,50,000లు విలువైన కారం, పిండి మిల్లులను రూ.35,000ల రాయితీతో అందజేసినట్లు తెలిపారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల వారు కారం గాని పిండి గాని పట్టించుకోవాలంటే ఉప్పుగుండూరు, చినగంజాం గ్రామాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఇదే గ్రామంలో ఈ మిషన్ ఇవ్వడం వలన ఒక కుటుంబానికి జవనోపాధి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీసీ కె.వెంకటస్వామి, వీవోఏ ఈశ్వరమ్మ, గ్రామ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వీవోఏలు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో అధికారుల తనిఖీ

మార్టూరు,నవంబరు18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హెచ్‌ఈ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈవో వస్రామ్‌నాయక్ ఆధ్వర్యంలో మండల అకాడమిక్ బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా అధికారులు ప్రధానోపాధ్యాయులు సబ్జెక్ట్ నిపుణులు పాఠశాలలోని వివిధ అంశాలను, విద్యార్థుల విద్యాసామర్థ్యాలను, పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కే.ప్రేమలత, ప్రధానోపాధ్యాయులు రూత్‌మెర్సీ, డి.శ్రీనివాసరావు, శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

22న మార్టూరులో జాబ్‌మేళా

మార్టూరు, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహకారంతో ఈ నెల 22న శనివారం స్థానికంగా శ్రీహర్షిణి డిగ్రీ కళాశాలలో ఏపీ రాష్ట్ర స్కిల్ డెవెలెప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు సంబంధిత కంపెనీలకు దరఖాస్తున్న వారు ఇంటర్వ్యూకార్డుతో హాజరుకావాలన్నారు. నిరుద్యోగులైన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గలిగిన వారు 9949914337, 9542970871 నంబర్లను సంప్రదించాలన్నారు.

పలు కుటుంబాలకు మంత్రి రవికుమార్ పరామర్శ



వెంకటేశ్వర్లు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మంత్రి

అద్దంకి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు కుటుంబాలను విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మంగళవారం పరామర్శించారు. అద్దంకి పట్టణంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు రంకెల వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందాడు. ఆయన చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. 2వ వార్డులో కేన్సర్‌తో బాధపడుతూ మిద్దెబోయిన పాపారావు భార్య ఇటీవల మృతి చెందారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. కట్టకిందపాలెం లో రిటైర్డ్ ఉపాధ్యాయుడు, ఫాస్టర్ స్టాలిన్ భార్య అనారోగ్యంతో బాధపడుతుండటంతో రవికుమార్ పరామర్శించారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన


అద్దంకి : విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు మంగళగిరిలో టీడీపీ జాతీయ కార్యాలయం, మధ్యాహ్నం 3 గంటలకు సత్తెనపల్లి నియోజకవర్గంలోని గుడిపాడులో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ నిధులు విడుదల కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి 7:30 గంటలకు మండలంలోని నాగులపాడులో జరిగే అయ్యప్ప పడిపూజా కార్యక్రమంలో రవికుమార్ పాల్గొననున్నారు.

లారీ ఢీకొని మోటార్‌సైకిలిస్టుకు గాయాలు

అద్దంకి, నవంబరు18(ఆంధ్రజ్యోతి): లారీ వెనక నుంచి మోటారు సైకిల్‌ను ఢీకొనడంతో మోటారు సైకిల్‌కు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు మండలంలోని శంఖవరప్పాడుకు చెందిన పుల్లా నాగేశ్వరరావు సోమవారం సాయంత్రం అద్దంకి పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ వైపు మోటార్‌సైకిల్‌పై వెళుతున్నాడు. పోతురాజు గండి వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. గాయాలైన నాగేశ్వరరావు ఒంగోలులోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

డబ్బులు ఇవ్వాలని దౌర్జన్యం చేయడంపై ఫిర్యాదు

అద్దంకి, నవంబరు18(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారంలో లావాదేవీల విషయమై ఇంటికి వచ్చి దౌర్జన్యం చేశారని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని శ్రీనగర్‌కు చెందిన మాధవి, ముండ్లమూరు మండలం శంకరాపురానికి చెందిన వీరాంజనేయులు కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. ఈ నేపథ్యంలో డబ్బులు విషయమై ఇంటికి వచ్చి వీరాంజనేయులు గొడవ చేస్తున్నాడని మాధవి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.



ప్రభుత్వ ఐటీఐలో కొత్త కోర్సులు

నెల్లూరు(విద్య), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, కంప్యూటర్ అండ్ పెరిఫెరల్స్(హార్డ్‌వేర్) కోర్సులను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ కే శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 ద్వారా టెన్త్ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతకు ఈ స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసిన వారు మంచి ఉపాధి అవకాశాలతోపాటు బ్యాంకుల ద్వారా ముద్రా రుణాలు కూడా పొందే అవకాశం ఉంటుందన్నారు. దీనిని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కావలి : రైతుబజారు ముందు ఆరుబయట కూరగాయలు అమ్ముకుంటున్న చిరు వ్యాపారులు



నెల్లూరు : ఫత్తేఖాన్‌పేట రైతుబజారులో ఖాళీగా ఉన్న దుకాణాలు

ఆంధ్రజ్యోతి పరిశీలన

రైతుల్లేని బజార్లు!

- వ్యాపారులదే హవా.. వారు చెప్పిందే ధర
- ఖాళీగా దుకాణాలు
- రోడ్లపై వ్యాపారాలకే రైతుల మొగ్గు
- ప్రజల ఆదరణ కూడా అంతంతే!

ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను దళారుల ప్రమేయం లేకుండా రైతన్నలే నిర్ణీత ధరకు అమ్ముకునేలా ఏర్పాటు చేసిన రైతుబజార్లలో వ్యాపారుల హవా ఎక్కువైంది. సంవత్సరాల తరబడి వారే దుకాణాల్లో తిష్టవేయడంతో అన్నదాతలు రోడ్డుపైన విక్రయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మరోవైపు మార్కెట్ ధరకు, రైతు బజారులో ధకు పెద్దగా వ్యత్యాసం లేకపోవడంతో వినియోగదారుల ఆదరణ కూడా రోజురోజుకు తగ్గిపోతోంది. దీంతో నెల్లూరు, కావలి, కందుకూరు, పొదలకూరులలో షాపులు ఖాళీగా ఉన్నాయి. ఆంధ్రజ్యోతి బృందం మంగళవారం రైతుబజార్లను పరిశీలించింది. ఆ వివరాలు..

కావలిలో వ్యాపార కేంద్రంగా..

కావలి (ఆంధ్రజ్యోతి) : కావలి రైతుబజారు వ్యాపార కేంద్రంగా మారి పోయింది. ఇక్కడ 105 దుకాణాలకుగాను 100 దుకాణాలలో వ్యాపారులే కూరగాయలు విక్రయిస్తున్నారు. రైతుల కోసం కేవలం ఒక దుకాణం కేటాయించారు. మరో దుకాణం రైస్ మిల్లర్లకు రాయితీపై బియ్యం, పప్పులు విక్రయాలకు కేటాయించారు. మరో మూడు దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. రైతుబజారు నిర్మాణానికి తొలివిడతగా రూ.45 కోట్లు మంజూరు కాగా వాటికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా ముందుకు సాగలేదు. అలాగే రైతుబజారును పూర్తిస్థాయిలో నిర్మిస్తే ఇబ్బందులు తలెత్తుతాయన్న భావనతో మరలా రూ.55 కోట్లతో మరో ప్రతిపాదన పంపారు. అయితే ఈ ప్రతిపాదన ఇంకా ఆమోదానికి నోచుకోలేదు. దీంతో రెండోవిడత నిధులు కూడా మంజూరైతే మొత్తం కలిపి కట్టాలా లేదా ముందు మంజూరైన నిధులతో నిర్మాణాలు చేపట్టి తదుపరి రెండో విడత చేపట్టాలా అనే సందిగ్ధంలో అధికారులు ఉన్నారు. ఇక రైతుబజారులో బోర్డులపై వేసిన ధరలు మార్కెట్ ధరకన్నాకొంత తక్కువగానే ఉన్నాయి. అయితే ఈ ధరల ప్రకారం కాకుండా వ్యాపారులు అధికధరలకు విక్రయిస్తున్నారు.

భగ్గుమంటున్న ధరలు



పొదలకూరు (ఆంధ్రజ్యోతి) : రైతుబజారులో ధరలు భగ్గుమంటుండ టంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. రూ.45లక్షలతో నిర్మించిన రైతుబజారును 2023, సెప్టెంబరు 13న ప్రారంభించారు. 24 దుకాణాలు ఉండగా, 14 షాపుల్లో వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. 10 షాపులు ఖాళీగా ఉన్నాయి. పంచాయతీ బస్టాండ్‌కు, గేట్ సెంటర్లకు ఈ బజారు దూరంగా ఉండడమే ప్రధాన కారణం. పైగా బజారులో వ్యాపారులు ఎక్కువగా ఉంటున్నారు. మార్కెట్ రేటుకు ఇక్కడి ధరకు వ్యత్యాసం పెద్దగా లేకపోవడంతో ప్రజాదరణ తగ్గిపోయింది.

వ్యాపారులదే హవా!

కందుకూరు (ఆంధ్రజ్యోతి) : రైతు బజారులో దుకాణాలన్నీ వ్యాపారుల చేతుల్లోనే నడుస్తున్నాయి. మొత్తం 60 షాపులు ఉండగా కేవలం రెండు షాపులు మాత్రమే రైతులకు కేటాయించారు. అదీ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయలు పండిస్తున్న ఇద్దరు ఆదర్శ రైతులకు మూడేళ్లక్రితం కేటాయించారు. రమారమి 10 షాపులు ఖాళీగానే ఉన్నా వాటిని ఎవరికీ కేటాయించకుండా వ్యాపారుల సౌలభ్యం కోసం ఖాళీగానే ఉంచుతున్నారు. నాలుగేళ్లక్రితం మున్సిపల్ కూరగాయల మార్కెట్ శిథిలావస్థకు చేరటంతో దానిని కూల్చివేసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించగా మార్కెట్‌లోని వ్యాపారులంతా రైతు బజారులో తాత్కాలిక ఆశ్రయం పేరుతో చేరిపోయి అక్కడే తిష్టవేశారు. దీంతో మొత్తం 50 దుకాణాలు వ్యాపారుల చేతుల్లోనే ఉన్నాయి. దీంతో ఎక్కడా ధరల పట్టికలు కూడా కనిపించవు. ధరల్లో వ్యత్యాసం కూడా ఏమీ లేకపోవడంతో వినియోగదారుల ఆదరణ తగ్గిపోయింది.

ఆదరణ కరువై..

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో రెండు రైతుబజార్లు ఉండగా, ఫత్తేఖాన్‌పేట సమీపంలో ఉన్న రైతుబజారుకు ఆదరణ కరువైంది. మద్రాసు బస్టాండు వద్ద ప్రధాన కూరగాయల మార్కెట్ ఉండటంతో ఎక్కువమంది అక్కడకే వెళ్లి కాయగూరలు తెచ్చుకుంటున్నారు. కాలక్రమేణా ఆదరణ లేకపోవడంతో రైతులు కూడా ఇటువైపు రావడం మానేశారు. కొంతమంది బియ్యం, ఉల్లిపాయలు, టమోటాల వ్యాపారం చేసినా క్రమేణా అవి కూడా నిలిచిపోయాయి. ఇప్పుడు ప్రొవిజన్ షాపులు, కొన్ని ప్రైవేటు కార్యాలయాలు, ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ఉత్పత్తులు, టిఫిన్ సెంటర్లు దర్శనమిస్తున్నాయి. ఇక్కడ 81 దుకాణాలు ఉండగా 43 దుకాణాల్లో మాత్రమే వ్యాపార లావాదేవీలు నడుస్తున్నాయి. 38 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి.

● నవాబుపేటలోని రైతుబజారు ప్రారంభంలో రైతులతో కిటకిటలాడింది. నారాయణరెడ్డిపేట, తోటపల్లిగూడూరు, ఇందుకూరుపేట తదితర ప్రాంతాల నుంచి రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను బస్సులు, ఆటోల్లో తీసుకొచ్చి అమ్ముకునేవారు. అయితే, అందరూ మద్రాసు బస్టాండు కూరగాయల మార్కెట్‌కు వెళ్లిపోవడంతో రైతులు ఇటువైపు చూడటం మానేశారు. దీంతో కొంతమంది వ్యాపారులు రైతుల వద్ద కూరగాయలు కొనుగోలు చేసుని ఇక్కడ అమ్ముతున్నారు. మొత్తం 58 దుకాణాలకు గాను 46 దుకాణాల్లో అద్దె వసూలవుతోంది. మిగిలిన 12 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి.



వినియోగదారులు లేక బోసిపోయిన నవాబుపేట రైతుబజారు

● ధరల్లో తేడా

కూరగాయల మార్కెట్‌కు, రైతుబజారుకు ధరల్లో కాస్త వ్యత్యాసం ఉంటోంది. మార్కెట్ ధర ప్రకారమే ఇక్కడ వ్యాపారాలు సాగేవని కొంతమంది వ్యాపారులు చెబుతున్నారు. అయితే వినియోగదారులు మార్కెట్‌లో తక్కువ ధరకు లభిస్తాయని రావడం మానేశారు. దీంతో వ్యాపారాలు లేక రైతులు మద్రాసు బస్టాండుతోపాటు రోడ్డు పక్కన కూడళ్ల వద్ద తమ ఉత్పత్తులు అమ్ముకుంటున్నారు. నవాబుపేట రైతుబజారులో మార్కెట్ ధరతో పోల్చితే రూ.5 ఎక్కువకు విక్రయిస్తున్నారు.



కేంద్రమంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టరు హిమాన్షు శుక్లా, పక్కన డ్వామా పీడీ గంగాభవాని

డ్వామాకి జాతీయ అవార్డు

● కేంద్ర మంత్రి నుంచి అందుకున్న కలెక్టరు

నెల్లూరు, (జడ్పీ), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జల్ సంచయ్-జన్ భాగీదారీ (జేఎస్‌జేబీ)-2015 అరుదైన అవార్డు నెల్లూరు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)కు దక్కింది. నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం, వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యమిచ్చినందుకు దక్షిణ జోన్‌లో కేటగిరీ-3 కింద జిల్లాకు ఈ అవార్డు లభించింది. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా కలెక్టరు హిమాన్షు శుక్లా అవార్డును అందుకున్నారు. ఆయన వెంట డ్వామా పీడీ గంగాభవాని కూడా ఉన్నారు. జేఎస్‌జేబీ పథకానికి సంబంధించి వర్షపు నీటిని వడిసిపట్టి భూగర్భజలాలను పెంచటంతోపాటు జలసంరక్షణలో కలెక్టరు ఆధ్వర్యంలో డ్వామా అధికారులు పటిష్టంగా పని చేశారు. 2024 సంవత్సరంలో జిల్లాలో 856 ఫారం పాండ్స్, 3495 ఇంకుడుగుంతలు, 112 ఊట చెరువులు, 166 చెక్ డ్యాంలు, 512 వాటర్ హార్వెస్టింగ్ పాండ్స్, 247 చెరువుల పూడికతీత పనులు చేపట్టారు. జిల్లాలో మొత్తంగా 5502 భూగర్భ జలాల రీచార్జ్ పనులు పూర్తి చేశారు.

కలెక్టరేట్‌లో కుప్పలుగా ఫైళ్లు

- వివరాలు 7లో..

25లోగా 'పది' ఫీజు కట్టాలి

నెల్లూరు(విద్య), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ఫీజును విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో ఈనెల 25వతేదీలోగా చెల్లించాలని డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50ల అపరాధ రుసుముతో ఈనెల 26 నుంచి డిసెంబరు 3వతేదీ వరకు, రూ.200 అపరాధ రుసుముతో డిసెంబరు 4 నుంచి 10 వరకు, రూ.500 అపరాధ రుసుముతో డిసెంబరు 11 నుంచి 15వతేదీ లోపల చెల్లించాలన్నారు. రెగ్యులర్ అభ్యర్థులు అన్ని సబ్జెక్టులకు రూ.125, మూడు సబ్జెక్ట్‌లపైన రూ.125లు, మూడు సబ్జెక్ట్‌ల వరకు రూ.110 చెల్లించాలని తెలిపారు. ఒకేషనల్ అభ్యర్థులు అదనంగా రూ.60లు చెల్లించాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పాఠశాల లాగిన్ నుంచి మాత్రమే ఫీజులు చెల్లించాలని ఆదేశించారు. అండర్ ఏజ్ రిలాక్సేషన్ సర్టిఫికెట్ ఫీజు రూ.300ను కూడా ఆన్‌లైన్‌లో చెల్లించాలని, సీఎఫ్‌ఎంఎస్ ద్వారా, బ్యాంక్ చలాన్లను అంగీకరించరని స్పష్టం చేశారు.

● పీఏటీ పరీక్ష ఫీజు చెల్లించాలి...

గ్రేడ్-2 పండిట్స్, వ్యాయామ ఉపాధ్యాయులకు, క్రాఫ్ట్, డ్రాయింగ్, టైలరింగ్ స్పెషల్ టీచర్లకు జరిగే ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్(పీఏటీ)కు, గ్రేడ్-1 పండిట్స్‌కు జరిగే సింపుల్ ఒరియంటేషన్ టెస్ట్‌కు ఫీజులు చెల్లించాలని డీఈవో బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వతేదీ లోగా ఎలాంటి అపరాధ రుసుము లేకుండా రూ.200లు, అపరాధ రుసుము రూ.60లతో కలిపి రూ.260లను డిసెంబరు 4వతేదీలోగా చెల్లించాలన్నారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 20వతేదీ నుంచి దరఖాస్తు అందుబాటులో ఉంటుందని, దీన్ని పూర్తి చేసిన వారు నగరంలోని దర్గామిట్ట ప్రభుత్వ పరీక్షల విభాగం కార్యాలయంలో అందచేయాలని కోరారు.

● హెచ్‌ఎం అకౌంట్ టెస్ట్‌కు పరీక్ష ఫీజు...

ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ కేటగిరిల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు డిసెంబరులో నిర్వహించే హెడ్‌మాస్టర్ అకౌంట్ టెస్ట్ పేపర్-1, పేపర్-2 పరీక్ష ఫీజును చెల్లించాలని డీఈవో బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. పేపర్-1కు రూ.100లు, పేపర్-2కు రూ.150లను ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 24వతేదీ లోపల చెల్లించాలన్నారు. రూ.60ల అపరాధ రుసుముతో ఈనెల 30వరకు చెల్లించవచ్చన్నారు. దరఖాస్తులు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, వీటిని పూర్తిచేసి నగరంలోని దర్గామిట్ట ప్రభుత్వ పరీక్షల విభాగం కార్యాలయంలో అందచేయాలని తెలిపారు.



అన్నదాత సుఖీభవ భరోసా

- మూడు విడతల్లో రూ.14వేల ఆర్థిక సాయం
- జిల్లాలో 1,95,866 మందికి లబ్ధి
- రెండో విడత రూ.5వేల నగదు జమ నేడు..
- పీఎం కిసాన్ రూ.2వేలు కూడా..

నెల్లూరు (వ్యవసాయం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్న రైతులకు పెట్టుబడి సాయం చేస్తూ కొంతమేర ఆసరాగా ఉంటున్నాయి. రబీ, ఖరీఫ్ సీజన్ల ప్రారంభంలో రైతులకు అవసరాలకు తగ్గట్టుగా నగదు రైతుల ఖాతాల్లో ప్రభుత్వాలు జమ చేస్తున్నాయి. జిల్లాలో 1,95,866 మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నగదుతోపాటు బుధవారం పీఎంకిసాన్ పథకం కింద 21వ విడత నగదు 1,61,358 మంది రైతులకుగాను రూ.2వేల చొప్పున రూ.32.27 కోట్లు జమ అవుతుంది.

● మూడు విడతల్లో రూ.14వేలు

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మూడు విడతల్లో రూ.14 వేలు జమ చేసేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించింది. రూ.5వేల చొప్పున రెండు విడతలుగా అదేవిధంగా మరో విడతలో రూ.4వేలు జమ చేయనుంది. ఇప్పటికే ఆగస్టులో మొదటి విడతగా రూ.5వేలు చొప్పున 1,95,866 మంది రైతుల ఖాతాలకు రూ.97.933 కోట్లు జమ చేసింది. రెండో విడత కింద బుధవారం రూ.97.933 కోట్లు జమ చేయనుంది.

● గతంలో రూ.7500 మాత్రమే..

గత ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రూ.7500 మాత్రమే అందించేది. రూ.5500, 2వేలు చొప్పున 2 విడతల్లో రైతులకు అందించింది. అయితే టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎంకిసాన్ పథకం ద్వారా మూడు విడతల్లో అందించే రూ.6వేలతోపాటు మొత్తం రూ.20వేలు రైతులకు అందుతోంది.

నియోజకవర్గాల వారీగా అర్హుల జాబితా

నియోజకవర్గం	లబ్ధిదారులు	నగదు (రూ.కోట్లు)
ఉదయగిరి	45,275	22.6375
ఆత్మకూరు	34,223	17.1115
కావలి	18,305	9.1525
కోవూరు	16,938	8.469
సర్వేపల్లి	27,958	13.979
నెల్లూరు	5,299	2.6495
వెంకటగిరి	1,6015	8.0075
కందుకూరు	31,853	15.9265
మొత్తం	1,95,866	97.933

ప్రాణం తీసిన సెల్‌ఫోన్

● రైలు ఢీకొని బీటెక్ విద్యార్థిని దుర్మరణం



హవిలా షారూన్ (ఫైల్)

కావలి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్ సంభాషణ ఓ యువతి ప్రాణం తీసింది. మంగళవారం కావలిలోని ఉదయగిరి బ్రిడ్జి కింద ఫోన్‌లో మాట్లాడుతూ పట్టాలు దాటుతున్న ఓ ఇంజనీరింగ్ విద్యార్థినిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు.. కొండాపురం మండలం సాయిపేటకు చెందిన పూండ్ల సురేష్, అనితల కుమార్తె హవిలాషారూన్ కావలిలోని విట్స్ కళాశాలలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నది. అనారోగ్యం కారణంగా 15 రోజులుగా ఇంటి వద్దే ఉంటూ కళాశాలకు వెళ్తున్నది. మంగళవారం ఉదయం 8.20 గంటలకు ఇంటి నుంచి కళాశాలకు వచ్చింది. బుధవారం పరీక్షలు ఉండటంతో రికార్డులు తీసుకునేందుకు ఫోన్ మాట్లాడుతూ రైలు పట్టాలు దాటుతున్నది. అదే సమయంలో కాన్పూర్ నుంచి బెంగళూరు వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ హవిలా షారూన్‌ను ఢీ కొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. లోకో పైలెట్ సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతురాలి వద్ద లభించిన ఆధారాల మేరకు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న మృతురాలి స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధువులు వైద్యశాలకు చేరుకున్నారు. చేతికి అందివచ్చిన కుమార్తె మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎస్ఐ వెంకట్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



'కాశీబుగ్గ' ఘటనలు

పునరావృతం కానీయొద్దు!

తప్పు చేస్తే భగవంతుడు క్షమించడు

రూ.118.5 కోట్లతో 58 ఆలయాల పునఃనిర్మాణం

'కాశీబుగ్గ' తరహా సంఘటనలు జిల్లాలో జరగకుండా ఆలయాల్లో పటిష్ట చర్యలు తీసుకోండి. ఆగమ శాస్త్ర విషయాల్లో వేద పండితులు, అర్చకులే నిర్ణయాలు తీసుకుంటారు. ఇందులో అధికారులు జోక్యం ఉండకూడదు. ఆలయాల్లో తప్పులు చేస్తే భగవంతుడు చూస్తున్నాడనే భయాన్ని కలిగి విధులు నిర్వహించాలి. టీటీడీలో కల్తీ లడ్డూ, పరకామణి సంఘటనలే ఇందుకు ఉదాహరణ. జిల్లాలో 58 ఆలయాలను రూ.118.5 కోట్లతో పునఃనిర్మిస్తున్నాం.

- నెల్లూరులో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

7

రోజంతా వాన



బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా మంగళవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఎడతెరపి లేని వర్షం కురవడంతో రోడ్ల మీద నీరు చేరి, వాహనరాకపోకలకు అంతరాయం కలిగింది. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నగటు వర్షపాతం 4.3 మి.మీగా నమోదైంది. అత్యధికంగా కొడవలూరులో 24.6 మి.మీ, అత్యల్పంగా అల్లూరులో 1.2 మిమీ వర్షం కురిసింది. నెల్లూరులో రోజంతా వర్షం కురవడంతో నగరవాసులు అసౌకర్యానికి గురయ్యారు. ఉద్యోగులు, విద్యార్థులు, రోడ్డుమార్జిన్ వ్యాపారులు అవస్థలుపడ్డారు. చలి కూడా తోడవడంతో వృద్ధులు, చిన్నారులు ప్రతికూలతను చవిచూశారు. ఉష్ణోగ్రత ఘననీయంగా పడిపోవడంతో గాలిలో తేమ పెరిగి చల్లటి గాలులు వీచాయి.

- నెల్లూరు(హరనాథపురం/సిటీ, ఆంధ్రజ్యోతి)

ఉదయగిరిలో బాలికపై అత్యాచారం

ఉదయగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నమ్మి వెంటవెళ్లిన ఓ బాలికపై యువకుడు లైంగికదాడికి పాల్పడిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. దుత్తలూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక 9వ తరగతి చదువుతోంది. వింజమూరు వాసి, హైదరాబాదులో హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతున్న సాధిఖ్‌తో ఆ బాలికతో ఏడు నెలలుగా పరిచయం ఉంది. ఈ తరుణంలో ఆదివారం సాధిఖ్ ఆ బాలికను తీసుకుని ఉదయగిరి దుర్గం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ అత్యాచారం చేసి తిరిగి ఇంటి వద్ద వదిలిపెట్టి వెళ్లిపోయాడు. బాలిక అస్వస్థతకు గురై రక్తస్రావం అవుతుండటంతో తల్లిదండ్రులు ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు సోమవారం తీసుకొచ్చారు. వైద్యులు బాలికకు పరీక్షలు నిర్వహించి అత్యాచారానికి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వైద్యశాలకు వెళ్లి వివరాలు సేకరించారు. ఈ మేరకు దుత్తలూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

సోమశిలలో 73.829 టీఎంసీల నిల్వ

అనంతసాగరం నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో 73.829 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 6,596 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దిగువ ఉత్తర కాలువకు 150, పవర్ టెన్నల్ నుంచి డెల్టాకు 2,650, కండలేరుకు 750 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

కావలి
కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు

రైతులకు అందుబాటులో యూరియా

ఉలవపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రబీలో సాగు చేసే పంటలకు అవసరమైన యూరియా అన్నీ రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందని మండల వ్యవసాయశాఖ అధికారి డీ.విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని మన్నేటికోట, ఆత్మకూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికంగా సాగు చేసే వాణిజ్య పంటల సస్య రక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ, వీహెచ్ఏ అజయ్, ప్రియాంక రైతులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	238
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100) : 640

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.11.705
వెండి కిలో ధర రూ. 1,57,400
వెండి ఒక గ్రాము రూ.162.40

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల రక్తదానం


అల్లూరు : రక్తదానం చేస్తున్న రామకృష్ణ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

అల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ యూనిట్-1 శిబిరంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. నెల్లూరు రెడ్ క్రాస్ సంస్థ మోటివేటర్ బీ.భాస్కర్ ఆధ్వర్యంలో రక్తాన్ని సేకరించారు. ఆయన మాట్లాడుతూ యర్రపుగుంటలో నిర్వహించిన ఈ క్యాంపులో తలేమియా వ్యాధిగ్రస్థులకు రక్త అవసరాలను తీర్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సుధీర్ సింగ్, మల్లికార్జునరెడ్డి, ఆధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండాపురం : రక్తగ్రూపును తెలుసుకోవడం ప్రతిఒక్కరి బాధ్యతని నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ. రమణ పేర్కొన్నారు. లైఫ్‌లైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలలోని విద్యార్థులకు రక్త వర్గ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నవీన్ మాట్లాడుతూ రక్త వర్గాన్ని నిర్ధారణ చేయించుకోవడం వల్ల ఆపదలో ఉన్న వారికి అత్యవసర సమయంలో రక్తం దానం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సాయిపేట క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు రామమోహనరావు, కొండాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాదాక్రిష్ణ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పద్మ, వెంకటేష్ పాల్గొన్నారు.

అల్లూరులో వణికిస్తున్న చలి

అల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం కారణంగా వాతావరణం చలిగా మారింది. రెండు రోజులుగా విపరీతమైన చలిగాలుల కారణంగా ప్రజలతోపాటు మూగజీవాలు వణికిపోతున్నాయి. మరో వారం రోజులు ఇదే వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

అల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌కు ఇబ్బందులు పడిన గిరిజనులకు ఏఆర్‌డీ సంస్థ సమకూర్చిన నిత్యావసర సరుకులను మంగళవారం ఇస్కపల్లి పంచాయతీ జవ్వాగు లక్ష్మీపురంలో పంపిణీ చేశారు. స్థానిక టీడీపీ నాయకులు దానం రజిని బాధితులకు దుప్పట్లు, టార్పాలిన్ పట్టలను అందచేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో మల్లికార్జున, సచివాలయ సిబ్బంది హరికృష్ణ, మల్లికార్జున, సంస్థ సిబ్బంది ఏడుకొండలు, అరుణ, కీర్తి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

కావలి రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): టూరిస్ట్ బస్సుల నిర్వాహకులు నిబంధనలు పాటించకుంటే కఠినచర్యలు తీసుకుంటామని ఆర్టీవో పీ. మురళీధర్ పేర్కొన్నారు. కావలి మండలం రుద్రకోట ఆర్టీవో కార్యాలయంలో మంగళవారం పట్టణంలోని టూరిస్ట్ బస్సుల యజమానులు, డ్రైవర్లకు అగ్నిప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ టూరిస్ట్ బస్సుల్లో అగ్ని ప్రమాదాల నియంత్రణ కిట్‌లతో పాటు మెడికల్ కిట్ తప్పని సరిగా ఉండాలన్నారు. శబరిమల యాత్రకు వెళ్లేటప్పుడు బస్సుల్లో గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, పేలుడు పదార్థాల వంటివి పెట్టుకుని వెళ్లరాదన్నారు. బస్సుల్లో ఎమర్జెన్సీ డోర్లు పనిచేసేలా చూసుకోవాలన్నారు. అనంతరం టూరిస్ట్ బస్సులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ సుందరరావు, అసిస్టెంట్ ఎంవీఐలు కరుణాకర్, లక్ష్మీభాయ్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): సమగ్ర సస్యరక్షణ చర్యలతో పైర్లను కాపాడుకోవచ్చని ఏవో శేషారెడ్డి తెలిపారు. మండలంలోని శామీరపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కందిపంటను పరిశీలించారు. అన్నదాత సుఖీభవ రెండో విడత, పీఎం కిసాన్ నిధులు బుధవారం విడుదల చేయనున్నట్లు తెలిపారు.

డిగ్రీలో స్పాట్ అడ్మిషన్

కందుకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

జనగణనలో కులగణన చేపట్టాలని ధర్నా


కందుకూరు :సబ్ కలెక్టరు కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు



కావలి : ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ, అనుబంధ సంస్థల నేతలు

కావలి, నవంబరు18(ఆంధ్రజ్యోతి) జనగణనలో కులగణన చేపట్టాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు దామా అంకయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఐ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం అంకయ్య మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన ఈ 11 ఏళ్ల కాలంలో దళిత,గిరిజ మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగి పోయాయన్నారు. మోదీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రక్షణ కరువైందన్నారు. తెలంగాణా మాదిరిగా ఎస్సీ ఎస్టీ, బీసీ వర్గాలకు స్థానిక సంస్థలలో సీట్లు కేటాయిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించినట్లుగానే ఏపీలో కూడా కులగణన చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి, సీపీఐ నేతలు కొప్పర్తి నాగరాజు, ఎస్‌డీ సిరాజ్, షాన్వాజ్,కొండలరావు, షాజహాన్, బోస్, నరసింహ, ఏఐటీయూసీ నాయకులు వై. రవి తదితరులు పాల్గొన్నారు.

● **ఆత్మకూరు** : జనగణనలో కులగణన చేపట్టాలని మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి యామాల మధు మాట్లాడుతూ ప్రధాని మోదీ అధికారం చేట్టిన తరువాత దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. కులాల ప్రాతిపదికన బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి జంగం నాగరాజు, నాయకులు చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

● **కందుకూరు** : దేశంలో సామాజిక న్యాయం, సమానత్వ సాధన, ఆత్మగౌరవంకోసం జనగణనతోపాటు కులగణన కూడా చేపట్టాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరు కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ అధికారం చేపట్టాక దళిత, గిరిజన, మైనారిటీలపై దాడులు మితిమీరిపోతున్నాయన్నారు. మతోన్మాద పాలన సాగుతోందని విమర్శించారు. దీన్ని ఐక్యంగా ఎదుర్కోవాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టరు కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వై. ఆనంద్ మోహన్, ఉప్పుటూరి మాధవరావు, చేవూరి దుర్గాప్రసాద్, కలవకూరి హరిబాబు, బొల్లోజుల బాలబ్రహ్మాచారి, కోటేశ్వరరావు, సుభాను తదితరులు పాల్గొన్నారు.

దొరికిన చైన్ పోలీసులకు అప్పగింత


దొరికిన బంగారం చైన్‌ను ఎస్‌ఐ శివనాగరాజుకు అందజేస్తున్న సువార్తమ్మ

కందుకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోస్టాఫీసు సెంటర్‌లో సోమవారం సాయంత్రం దొరికిన బంగారం చైనును ఓ మహిళ మంగళవారం పోలీసులకు అప్పగించి తన నిజాయితీని చాటుకుందని పట్టణ ఎస్‌ఐ శివనాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం ప్రకారం గుడ్లూరు మండలం చిమిడితపాడుకి చెందిన గద్దె సువార్తమ్మకు సోమవారం సాయంత్రం నాలుగుగంటల ప్రాంతంలో సుమారు ఒకటిన్నర సవర్ల ఓ బంగారం చైను దొరికింది. ఆమె ఆ చైనును పోలీసులకు అప్పగించారు. చైను పోగొట్టుకున్న వారు ఎవరైనా తమను సంప్రదించాలని అందించిన సమాచారంతో బాధిత మహిళ మంగళవారం పోలీసుస్టేషన్‌కు రాగా ఆమె చెప్పిన వివరాలు సరిపోలటంతో ఆ చైనును బాధితురాలికి ఎస్‌ఐ అందజేశారు. చైను పోగొట్టుకున్న గంగోలు లక్ష్మీప్రసన్నది కూడా గుడ్లూరు మండలం చిమిడితపాడు. ఆమె సోమవారం సాయంత్రం కందుకూరు వచ్చి బస్సు దిగిన కొద్దిసేపటితర్వాత తన మెడలో చూసుకోగా బంగారం చైను లేనివిషయం అర్థమైందని వివరించారు.

విట్స్‌లో పారిశ్రామికవేత్తల దినోత్సవం

కావలి (టౌన్), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ పారిశ్రామిక వేత్తల దినోత్సవం జరిగింది. చవేరా గ్రూప్స్ అధినేత చెన్నా వెంకటరామయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత పారిశ్రామిక రంగంలో ఆసక్తి కనబరచాలని, నూతన ఆలోచనలతో కూడిన ఆవిష్కరణలకు నాంది పలకాలన్నారు. టెక్నాలజీతో కూడిన పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలన్నారు. జలదంకి యూనియన్ బ్యాంక్ మేనేజర్ రామకృష్ణయ్య మాట్లాడుతూ గతంలో పరిశ్రమలు స్థాపించాలంటే పెట్టుబడుల సమస్య తీవ్రంగా ఉండేదని, ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ప్రభుత్వరంగ సంస్థలు వినూత్న ఆలోచనలతో ముందుకొచ్చి యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు రుణం అందిస్తున్నాయన్నారు. సీనియర్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు ఉన్నత విద్యకు రూ.40లక్షల వరకు రుణాలు అందిస్తున్నామన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ అనీల్‌కుమార్ చెన్నా వెంకటరామయ్యను సత్కరించారు. విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడిమిక్ డైరెక్టర్‌లు ప్రత్యూషారెడ్డి, లిఖిత్‌రెడ్డిలు నిర్వాహకులను అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కావలి, నవంబరు18(ఆంధ్రజ్యోతి): వివిధ వ్యాధులపై చికిత్స పొంది, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న 41 మందికి రూ.27,28,936 విలువైన చెక్కులను టీడీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనే సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో కావలి ముందంజలో ఉందన్నారు. చంద్రబాబు పాలనలో వర్షాలు సమృద్ధిగా కురిసి,రాష్ట్రం రామరాజ్యాన్ని తలపిస్తోందన్నారు.

● **బాధిత కుటుంబాలకు పరామర్శ**

దగదర్తి (బిట్రగుంట) : దగదర్తి మండలంలోని పలు టీడీపీ కుటుంబాలను ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి మంగళవారం పరామర్శించారు. ముందుగా ఐతంపాడు కొత్తూరులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెం దిన అలవల రత్నమ్మ కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మనుబోలుపాడు టీడీపీ నేత దగుమాటి నాగరాజురెడ్డి తల్లి హజరమ్మ ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాన్ని, కామినేనివారిపాలెంలోని టీడీపీ నేత వంకరదారి రత్నం తమ్ముడు వేణు మృతి చెందగా, ఆ కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు తోడుగా ఉంటానని ఆయన తెలిపారు. ఆయన వెంట టీడీపీ నేతలు పమిడి రవికుమార్ చౌదరి, జలదంకి శ్రీహరినాయుడు, తాళ్లూరు సుధాకర్ నాయుడు, కండ్లగుంట మధుబాబునాయుడు, చేజర్ల ప్రభాకర్‌రెడ్డి. వెంకటరత్నం, అల్లంహనుమంతరావు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పల పడిపూజ

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ద్వారకనగరులోని షిరిడి శేషసాయి మందిరంలో మంగళవారం అయ్యప్పస్వామి భక్తుల పడిపూజను వైభవంగా నిర్వహించారు. మందిర ఆవరణంలోని కల్యాణమండపంపై అయ్యప్ప చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, పూజ చేశారు.

ఎన్జీవో ఎన్నికలకు నోటిఫికేషన్

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): తాలుకా ఏపీ ఎన్‌జీవో కార్యవర్గం ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఆ సంఘ కార్యవర్గ సభ్యుడు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత కార్యవర్గ పదవీకాలం ఈనెలలో ముగియనుండడంతో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకొనేందుకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఈనెల 21న నామినేషన్ల దాఖలు, అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారన్నారు. ఎన్నికల అధికారిగా కావలి తాలుకా అధ్యక్షుడు ఎస్.శివకుమార్‌ను నియమించారు.

అబద్ధాలు ప్రచారం చేస్తే పరువు నష్టం దావా వేస్తా : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో తన రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సంబంధించి జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, వాస్తవాలు తెలుసుకోకుండా అసత్యాలు ప్రచారంచేస్తే పరువునష్టం దావా వేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు ఇచ్చాకే లేఅవుట్లు వేశామని, అయితే ప్రభుత్వ భూమిని ఆక్రమించి విల్లాలు నిర్మించినట్లు అసత్యప్రచారం చేస్తున్నారన్నారు.గత 25 ఏళ్లుగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉన్న తాను సుమారు 100 ఎకరాల్లో లేఅవుట్లు వేశానని, అన్నీ నిబంధనల ప్రకారమే చేశాను తప్ప... ఎక్కడా తప్పటడుగు వేయలేదన్నారు. కందుకూరు అభివృద్ధి కోసం తాను చేస్తున్న ప్రయత్నానికి ఎవరు సలహాలు ఇచ్చినా తీసుకుంటానన్నారు. పట్టణంలో రోడ్ల విస్తరణ, డివైడర్ ఏర్పాటు, సెంట్రల్ లైటింగ్ పనులు సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామన్నారు. కాగా నియోజకవర్గంలోని 39మందికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ. 26.73 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి అందచేశారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

ఏఎస్ పేట, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం నిర్వహించిన పుస్తక ప్రదర్శన ఆకట్టుకుంది. గ్రంథాలయ అధికారి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జనరల్ నాలెడ్జ్, సైన్స్, వ్యక్తిత్వ వికాసం, బాల సాహిత్యం, మహనీయుల జీవిత చరిత్రలు తదితర పుస్తకాలను ప్రదర్శించారు. విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రుక్మిణి, నాణేల సేకరణకర్త ఎండీ వాయిజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మంత్రి ఆనం పర్యటన

ఆత్మకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బుధవారం ఆత్మకూరులో పర్యటించనున్నారు. ఉదయం మినీ బైపాస్ రోడ్డు పనులను పరిశీలించి, క్రీడా వికాస కేంద్రం ప్రాంగణాన్ని సందర్శిస్తారు. రక్షిత మంచినీటి పథకం వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద నీటి సరఫరాను పరిశీలించిన అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారు. మధ్యాహ్నం శ్రీధర్ గార్డెన్స్‌లో రెండో విడత అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ప్రభుత్వం జిల్లాలో 1.96 లక్షల మంది రైతులకు రూ. 1.20 కోట్లు రైతులకు జమ చేయనున్నట్లు ఒక ప్రకటనలో అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు.

నేడు ఎమ్మెల్యే కురుగొండ్ల రాక

కలువాయి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' నిధులను బుధవారం ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేయనున్నారు.ఈ నేపథ్యంలో స్థానిక ఉమామహేశ్వరి కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొంటారని మండల టీడీపీ కన్వీనర్ చల్లా రఘురామిరెడ్డి తెలిపారు. కలువాయిలో నిర్వహించే రైతు ర్యాలీని మండలంలోని రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పచ్చదనం-పరిశుభ్రతపై అవగాహన

సంగం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీల సుస్థిరాభివృద్ధి, పచ్చదనం, పరిశుభ్రతపై సర్పంచులు, కార్యదర్శులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో షాలెట్ గాంధీజీ, అంబేడ్కర్ చిత్ర పటాలకు పూల మాలల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సురేష్ కుమార్, మండల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కుబడిగానే క్లీన్ అండ్ గ్రీన్ శిక్షణ


శిక్షణకు హాజరైన పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రారంభమైన క్లీన్‌అండ్‌గ్రీన్ విలేజ్ (థీమ్-5) శిక్షణ తొలిరోజు మొక్కుబడిగానే సాగింది. ఎంపీడీవో రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణకు పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. 24 మంది సర్పంచులకుగానూ ఇద్దరే హాజరయ్యారు. ఈ తరుణంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం సాధ్యమేనా ? అన్న అనుమానాలున్నాయి. తొలుత అంబేడ్కర్, గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శిక్షణ ప్రారంభించారు.

సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇంద్రసేనారెడ్డి

ఉదయగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగానికి దూరంగా ఉండాలని ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులకు అధికంగా సెల్‌ఫోన్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌లో పంపే లింకులను ఓపెన్ చేయరాదన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు మేనేజర్ జయదేవ్, ప్రిన్సిపాల్ భాస్కర్, కరస్పాండెంట్ షైనుద్దీన్ పాల్గొన్నారు.

ఆయకట్టు పరిధిలో అభివృద్ధి పనులు


కట్టలపై పెరిగిన ముళ్లచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఉదయగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయం ఆయకట్టు పరిధిలోని అధికారులు మంగళవారం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జలవనరుల శాఖ డీఈ కందుకూరి చంద్రమౌళి, జలాశయ చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జలాశయం అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.74 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో జలాశయ ఆవరణలోని కట్టపై పేరుకుపోయిన చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించడంతోపాటు కాలువల్లో పూడికతీత, పిచ్చిమొక్కల తొలగింపు చేపట్టామని తెలిపారు. అలాగే కాలువల ట్రాక్‌పై ఏపుగా పెరిగిన కంపచెట్లను సైతం తొలగించామన్నారు. నెలాఖరుకు పనులు పూర్తి చేసి డిసెంబరు 5న సాగునీరు విడుదల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈలు వేణు, సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ సంప్రోక్షణ


అయ్యప్పస్వామి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న మన్నేటి వెంకటరెడ్డి దంపతులు

ఉదయగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిరెడ్డిపల్లిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, శ్రీలక్ష్మీ దంపతులు, అయ్యప్ప సేవ సమాజానికి అందించిన పంచలోహ విగ్రహానికి మంగళవారం సంప్రోక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, కలశస్థాపన, పంచామృతాభిషేకం, హోమం, పూర్ణాహుతి, సంప్రోక్షణ నివేదన, నీరాజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నేటి దంపతులు, అయ్యప్పభక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం పంచలోహ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పలు మండలాల అయ్యప్ప భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వింజమూరు : వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

వింజమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయాధికారి జ్యోతి కొండయ్య ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పోటీ పరీక్షల పట్ల ఆసక్తిని కలిగించేలా, తద్వారా వారిలోనే ప్రతిభను బయటకు తీయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

● **అనంతసాగరం** : స్థానిక గ్రంథాలయంలో మంగళవారం 8, 9 తరగతుల విద్యార్థులకు వివిధ సబ్జెక్టుల్లో ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు నారాయణరావు, ఉపాధ్యాయులు అల్లాబక్ష్ పాల్గొన్నారు.

●**దుత్తలూరు(ఉదయగిరి)** : దుత్తలూరు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి సునీల్‌కుమార్ మాట్లాడుతూ 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు ముగింపు రోజు బహుమతులు అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

'పది'లో నూరు శాతం ఫలితాలు సాధించాలి

దుత్తలూరు(ఉదయగిరి), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వసతిగృహ విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేలా వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమాధికారిణి కె.శోభారాణి ఆదేశించారు. మంగళవారం మండలంలోని నర్రవాడ ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఏఎస్‌డబ్ల్యూవో కొండ్రెడ్డి రమణారెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధకనపర్చడంతో పాటు రుగ్మతలతో బాధపడే వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించడంతోపాటు నిత్యావసర వస్తువులు, వసతిగృహ పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ రామ్మూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు సర్వే పక్కాగా నిర్వహించాలి

ఉదయగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం పీహెచ్‌సీ పరిధిలో చేపడుతున్న కుష్ఠువ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వేను వైద్యఆరోగ్య సిబ్బంది పక్కాగా నిర్వహించాలని వైద్యాధికారి శివకల్పన పేర్కొన్నారు. మంగళవారం ఆమె మండలంలో జరుగుతున్న సర్వే పరిశీలించి సిబ్బందికి సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పక్కన చెత్త వేస్తే జరిమానా

సీతారామపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రతీ షాపు వారు చెత్తను, ప్లాస్టిక్‌ను రోడ్డు పక్కన వేస్తే, జరిమానా విధిస్తామని డిప్యూటీ ఎంపీడీవో శివప్రసాద్ అన్నారు. సీతారాముపుర బస్టాండ్ సెంటర్, రజిక కాలనీ,మారంరెడ్డి పల్లి సొసైటీ సమీపంలో నిర్వహించిన పారిశుధ్య పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులు నిర్వహించాలని, రోడ్ల పై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.కచ్చా డ్రైనేజీలను శుభ్రం చేయించాలని, రోడ్ల పక్క చెత్తాచెదారాలను తొలగించి, బ్లీచింగ్ చల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పిడుగు రవీంద్ర ,పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

గణిత సామర్థ్యాల్లో విద్యార్థులు రాణించాలి


విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో మస్తాన్‌వలి

సీతారామపురం,నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగు, గణిత సామర్థ్యాలలో విద్యార్థులు బాగా రాణించాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి అన్నారు.ఆయన మండల పరిధిలోని గంగవరం , నెమళ్లదిన్నె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను మంగళవారం సందర్శించి, విద్యార్థుల మూల్యాంకన పుస్తకాలను పరిశీలించారు.అలాగే విద్యార్థుల రాత అంశాలను పరిశీలించారు.అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జన్నాల వెంకటేశ్వర్లు, పామనబోయిన బాలకృష్ణ, సురేష్, సీఆర్‌పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు దుకాణాలకు వేలం

ఉదయగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వింజమూరులోని లక్ష్మీప్రియ థియేటర్ ఎదురుగా ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మించిన రెండు గదులను అద్దెప్రాతిపదికన ఇచ్చేందుకు వేలం ద్వారా గిరిజనుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో బీ.శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం నెల్లూరు కొండాయపాళెంగేటు దగ్గర గల ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కార్యాలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఉదయగిరి మండలంలోని గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 90003 49106 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

ఉదయగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో రసాయనిక ఎరువులు వినియోగాన్ని తగ్గించాలని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ తెలిపారు. మంగళవారం మండలంలోని వెంగళరావునగర్, ఉదయగిరి-2 రైతుసేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటల సాగుకు ముందు ప్రతి రైతు విత్తనశుద్ధి చేపట్టాలన్నారు. పంట మార్పిడి విధానాన్ని పాటించాలన్నారు. అనంతరం సాగులో ఉన్న పైర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దీక్షారంభం ప్రారంభం

ఉదయగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ(హన్స్) వ్యవసాయంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు మంగళవారం దీక్షారంభం కార్యక్రమాన్ని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నిధుల ద్వారా 2019 నుంచి ఈ కార్యక్రమం అమలు చేస్తున్నామన్నారు.